
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 26.02.2016, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 39 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

## జంపింగ్ జిలానీల పవర్ షో



### ➤ దేశంలోకి వైకాపా ఎమ్మెల్యేలు
### ➤ అంతా అధికార మహిమ

ఇంతకుముందు పార్టీలు మార్చిన నాయకులను ప్రజలు చీప్‌గా చూసేవాళ్లు. సిగ్గు, లజ్జ, మానం, అభిమానం లేనివాళ్ల క్రింద జమకట్టేవాళ్లు. గతంలో నాయకులు పార్టీలు మారడం చాలా అరుదుగా జరిగేది. ఇంతకుముందు సిద్ధాంతపరమైన విభేదాలొచ్చినప్పుడు పార్టీలు మారేవాళ్ళు. గతంలో పార్టీల మీద, పార్టీ అధినాయకత్వం మీద వున్న అభిమానంతో నాయకులు పార్టీలలో కొనసాగేవాళ్ళు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నా, అధికారపక్షంలో వున్నా ఒకే విధంగా చూసేవాళ్ళు. గతంలో నాయకులు పార్టీలు మారకుండా కుదురుగా ఉండడానికి కారణం రాజకీయాలలో అప్పుడు డబ్బు ప్రభావం తక్కువ. నాయకులకు డబ్బుతో అంతగా పని లేనప్పుడు అధికారపక్షంలో ఉంటేనేం? ప్రతిపక్షంలో ఉంటేనేం?

ఇప్పుడు రాజకీయమంటే డబ్బే! రాజకీయాలలో రాజకీయాన్నే వృత్తిగా చేసుకున్న నాయకుల కంటే కూడా కాంట్రాక్టర్లు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు రాజకీయ నాయకులయ్యారు. వీళ్లే మన ప్రజాప్రతినిధులవుతున్నారు. వీళ్లకి పార్టీల మీద భక్తి, పార్టీ సిద్ధాంతాల మీద అనురక్తి ఎక్కడ ఉంటుంది.

ఈమధ్య కాలంలో రాజకీయ నాయకులను చూస్తుంటే అసలు అధికారం లేకుంటే బ్రతకలేమన్నట్లుగా తయారవుతున్నారు. అటు తెలంగాణలో, ఇటు ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్న వలసలను చూస్తుంటే ఎన్నికలొచ్చే దాకా ఏ రాష్ట్రంలో అయినా ప్రతిపక్షం అనవసరమనిపిస్తోంది. ఎందుకంటే అందరూ అధికారపార్టీలో చేరి చేతినిండా సంపాదించుకుని, ఎన్నికల వేళకు ఎవరి ఇష్టం వచ్చిన చోటుకు వాళ్లు మళ్ళీ వెళ్లిపోవచ్చు.

తెలంగాణలో తన పార్టీ ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌లోకి పోతుంటే సంతలో పశువులను కొన్నట్లు తమ ఎమ్మెల్యేలను కొంటున్నారని ఆగ్రహిస్తున్న చంద్రబాబు, మరి ఆంధ్రప్రదేశ్‌లో ఆపరేషన్ ఆకర్ష్ పేరుతో అదే పని చేస్తుండడం విమర్శలకు తావిస్తోంది. తెలుగుదేశం పార్టీ విసిరిన అధికారం ఆకర్షణ వలకు వైకాపా ఎమ్మెల్యే చేపలు బాగానే పడుతున్నాయి. తొలుత ఎమ్మెల్యేలు భూమా నాగిరెడ్డి, భూమా అఖిలప్రియ, జలీల్‌ఖాన్, దేవగుడి ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి చంద్రబాబు సమక్షంలో తెలుగుదేశం తీర్థం పుచ్చుకోగా పక్కరోజే కడప జిల్లా బద్వేలు ఎమ్మెల్యే జయరాములు సైతం అదే బాట పట్టాడు. (మిగతా 11వ పేజీలో)




## సెంబ్‌కార్ప్ - గాయత్రిల సందడి

### నెల్లూరుకు ప్రముఖుల తాకిడి

(వివరాలు 11వ పేజీలో)





## ఇసుక దోపిడీకి 'టెండర్'

### • విచారణకు ఆదేశించిన కలెక్టర్

రాష్ట్రంలో అధికారపార్టీ నాయకులకు ప్రధాన ఆదాయవనరు ఇసుక. ఇంతకుముందు రాజకీయ నాయకులు దీని జోలికి వచ్చేవాళ్లు కాదు. ఇప్పుడు ఇసుకలో ఉన్నంత డబ్బు మరిదేంట్లోనూ ఉండడం లేదు. అందుకే అందరి కళ్ళు ఇసుక మీదే పడ్డాయి.

జిల్లాలో ఇసుకరీచ్‌ల టెండర్ల వ్యవహారం అయోమయంలో పడింది. ఇసుక ద్వారా ప్రభుత్వం ఏదో చేయాలనుకుంటే, కాంట్రాక్టర్లు సిండికేట్‌గా ఏర్పడి ఇంకోటి చేస్తున్నారు. ప్రభుత్వం ఒక ఎత్తు వేస్తే, కాంట్రాక్టర్లు ఇంకో ఎత్తు వేసి ప్రభుత్వాన్నే బోల్తా కొట్టిస్తున్నారు. డ్వాక్రా సంఘాలను తప్పించి రాష్ట్రంలోని అన్ని ఇసుకరీచ్‌లకు టెండర్లు, వేలం ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించడం తెలిసిందే! ఈమేరకు జిల్లాలో 25 ఇసుకరీచ్‌లకు టెండర్లను ఆహ్వానించడం జరిగింది. క్యూబిక్ మీటర్ ఇసుక ధరను వంద రూపాయలుగా నిర్ణయించారు. కాంట్రాక్టర్లు ఇక అంతకుమించే బిడ్‌లు వేయాలి. వినియోగదారుడికి 550 రూపాయలకే క్యూబిక్ మీటర్ ఇసుకను అమ్మాలి. జిల్లాలోని 25రీచ్‌లకు టెండర్లు వేసేందుకు వ్యాపారులు, నాయకులు కలిసి పోటీలు పడ్డారు. అధికవడ్డీలకు (మిగతా 11వ పేజీలో)



# పేరుకే నిషేధం... తింటే విషాదం



- విజృంభిస్తున్న గుట్కా మహమ్మారి
- ఉదాసీనంగా పోలీసు శాఖ

నెల్లూరుజిల్లాలో గుట్కా మహమ్మారి ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడుతోంది. చిన్నచిన్న టీ బంకుల దగ్గర నుంచి కిరాణా దుకాలు వరకు లభించని గుట్కాలు లేవు. గుట్కాలపై నిషేధం లేనప్పుడు రెండు రూపాయలకు ప్యాకెట్ దొరికేది. నిషేధం విధించిన తర్వాత అదే ప్యాకెట్‌ను పది రూపాయల వరకు విక్రయిస్తున్నారు. గుట్కాలకు అలవాటు పడ్డవారు ఎంతకైనా సంకోచించకుండా కొని తింటున్నారు. ప్రభుత్వం కేజీ బియ్యాన్ని ఒక్క రూపాయి లెక్కన విక్రయిస్తుంది, ఒక్క గుట్కా ప్యాకెట్‌కు పెట్టే ఖర్చుతో పది కేజీల బియ్యాన్ని కొనవచ్చు. నెల్లూరుజిల్లాలో కొంతమంది గుట్కా మాఫియా కనుసన్నల్లో ఈ విక్రయాలు యధేచ్ఛగా జరుగుతున్నాయి. కొన్నింటిని చెన్నై నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. నగరాలు, పట్టణాలు, గ్రామాలు అన్న తేడా లేకుండా అమ్మకాలు సాగుతున్నాయి. ఈ వ్యవహారంలో పోలీసు శాఖ ఉదాసీనంగా వ్యవహరిస్తోందని చెప్పవచ్చు. ప్రతి నెల కోట్లాది రూపాయల విక్రయాలు సాగుతున్నాయి. గతంలో ప్రముఖ కంపెనీలు వీటిని ఉత్పత్తి చేసేవి. పొగాకు మిళితమైన నికోటిన్ ఉన్న ఉత్పత్తులపై ప్రభుత్వం నిషేధం విధించింది. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల ప్రకారం గుట్కాల అమ్మకాలపై నిషేధం ఉంది. పొగాకు లేని పాన్‌మసాలాపై నిషేధం లేదు. దీన్ని ఆసరా చేసుకుని గుట్కాలు చెలామణి అవుతున్నాయి. పార్సిల్ సర్వీసులో గుట్కాలు రవాణా అవుతున్నా పోలీసులు మాఫియాతో కుమ్మక్కై సమాచారం అందినా దాడులు చేయడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి. ఆహార కల్తీ నిరోధక శాఖ వీటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. నగరపాలక సంస్థ, మునిసిపాలిటీల్లో ఆహార తనిఖీ అధికారులు వున్నా గుట్కా అమ్మకాలను గురించి పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న గుట్కా మాఫియాపై నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది.

# విద్యార్థులకు అభినందనలు




సింహపురి ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన మూడవ వార్షికోత్సవ సంబరాలలో శ్రీ నేతాజీ పైలట్ హైస్కూలు విద్యార్థులు మెడల్స్ సాధించినందుకు స్కూలు కరస్పాండెంట్ ఎం.వి.సుబ్బారెడ్డి అభినందనలు తెలియజేశారు. డ్రాయింగ్ పోటీలలో మతసామరస్యంపై మౌక్తిక, ఎస్.జశ్వంత్, డి.నిఖితసాయి, పి.మేఘశ్రీవర్ధన్, బి.కుశాల్‌రెడ్డి, ఎం.శ్రీమణి కంఠలు ప్రథమ బహుమతులు, జూనియర్స్, సీనియర్స్ కేటగిరీలలో గోల్డ్‌మెడల్స్ సాధించినట్లు సుబ్బారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నరేంద్రరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్న, వైస్‌ప్రిన్సిపల్ వాణి, విద్యార్థులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విక్రమ సింహపురి పాలకమండలి నియామకం

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయానికి ప్రభుత్వం పాలకమండలిని నియమించింది. పాలకమండలిలో 9మంది సభ్యులను నియమిస్తూ సోమవారం జిఓ నెంబరు 9ను విడుదల చేసింది. వర్సిటీ వైస్‌ఛాన్సలర్ వీరయ్యను పాలకమండలి అధ్యక్షుడిగా, సభ్యులుగా కావలి పిజి కళాశాల సీనియర్ ప్రొఫెసర్ ఎం.చంద్రయ్య, వర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ వెంకటరావు, సోషల్ వర్క్స్ టీచర్ కుసుమ, కావలి జవహర్ భారతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పెద్దినేని సుబ్రహ్మణ్యంనాయుడు, గుర్తింపు పొందిన డిగ్రీ కళాశాల ప్రతినిధిగా శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సునీల్‌కుమార్ నియమితులయ్యారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన మరో నలుగురిని పాలకమండలిలో సభ్యులుగా నియమించింది. వీరిలో జివికె ఇండస్ట్రీస్ వైస్‌ఛైర్మెన్ జి.వి.సంజీవరెడ్డి, బొల్లినేని వైద్యసంస్థల ఛైర్మెన్ బొల్లినేని కృష్ణయ్య, కావలికి చెందిన న్యాయవాది గద్దె మాల్యాద్రి, విఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ పి.రాధిక ఉన్నారు.

# రోహిత్ ఆత్మహత్యపై విచారణ జరపాలి

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ దళిత విద్యార్థి వేముల రోహిత్ ఆత్మహత్యపై ప్రభుత్వం స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని నెల్లూరు ఏజెసీ రాజ్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించినట్లు ఏపి దళిత విద్యార్థిసేన జిల్లా అధ్యక్షుడు అరవ పూర్ణప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు.



# అవినీతికి కేరాఫ్ అడ్రస్

- రిజిస్ట్రేషన్ శాఖలో... షరా మామూలే




కుక్కతోక వంకర సామెతలా... రిజిస్ట్రేషన్ శాఖలో ఏసిబి ఎన్ని దాడులు చేసినా షరామామూలుగానే ప్రైవేటు వ్యక్తులు పనులు చక్కబెడుతున్నారు. పదేళ్ళ క్రితం నెల్లూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసిబి దాడులు నిర్వహించింది. సుదీర్ఘకాలం తర్వాత ఇటీవల మరలా అవినీతి నిరోధక శాఖ కేంద్ర పరిశోధన బృందం(సిబియూ) నెల్లూరు రిజిస్ట్రేషన్ శాఖలో రెండురోజుల పాటు సమగ్రంగా తనిఖీలు చేపట్టింది. దాడులు జరిగి వారంరోజులు గడిచినా ప్రైవేటు వ్యక్తులు అన్ని పనులు చక్కపెడుతుండడం విశేషం. నెల్లూరుజిల్లా పరిధిలో నెల్లూరు, గూడూరు రిజిస్ట్రేషన్ జిల్లాలు ఉన్నాయి. నెల్లూరు పరిధిలో తొమ్మిది, గూడూరు పరిధిలో 10 సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాలున్నాయి. ఇటీవల జిల్లా కోర్టు కాంపౌండు నుండి మద్రాసు బస్టాండ్ వద్దనున్న జూబ్లీ ఆసుపత్రి ప్రాంగణానికి మారిన రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలో జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1, 2లు ఉన్నాయి. వీటితో పాటు స్టోన్‌హౌస్‌పేట సబ్‌రిజిస్ట్రార్ (ప్రస్తుతం బాలాజీనగర్) కార్యాలయం, బుజబుజనెల్లూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఉన్నాయి. వీటిలో ప్రైవేటు వ్యక్తుల ద్వారా ఎక్కువ అక్రమ వసూళ్ళు సాగుతుంటాయి. ఈ నెల 17వ తేదీ బుధవారం మంచిరోజు కావడంతో రిజిస్ట్రేషన్లు ఎక్కువగా జరుగుతున్నాయన్న సమాచారంతో సిబియూ నిఘా పెట్టింది. రాత్రి 9.30 గంటల సమయంలో స్థానిక ఏసిబి అధికారులతో పాటు, ప్రకాశం, చిత్తూరు, కడపకు చెందిన ఏసిబి అధికారులు ఈ దాడుల్లో పాల్గొన్నారు. బుధవారం రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం 12.30 గంటల వరకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అన్ని కోణాల్లో పరిశీలించారు. తనిఖీల్లో రూ.2,41,305లు నగదును స్వాధీనం చేసుకున్నారు. 13మంది ప్రైవేటు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడంతో పాటు సబ్ రిజిస్ట్రార్ల ఇళ్లలోను తనిఖీలు చేపట్టారు. నెల్లూరు రిజిస్ట్రార్ కార్యాలయంలో 2005 ఏప్రిల్‌లో ఏసిబి ఆకస్మిక తనిఖీ చేసి రూ.70వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. పది సంవత్సరాల తర్వాత సిబియూ ఆకస్మిక దాడి చేసి లక్షల్లో నగదును, ప్రైవేటు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. 17వ తేదీ బుధవారం సాయంత్రం నుంచి అక్కడక్కడ పొంచివున్న సిబియూ బృందం సభ్యులు హఠాత్తుగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోకి వెళ్ళి 13మంది ప్రైవేటు వ్యక్తులను పట్టుకుని వారి వద్ద వున్న సొమ్మును స్వాధీనం చేసుకున్నారు.

***ఏసిబి విచారణలో...*** ఏసిబి విచారణలో తేటతెల్లమైంది ఏమిటంటే అసైన్డ్ భూములు రిజిస్ట్రేషన్లు, వివాదాస్పద భూములు, స్థలాలు తదితర రిజిస్ట్రేషన్లకు ఫీజు టు ఫీజు వసూలు చేస్తున్నట్లు వెల్లడైంది. ఒక్కో లావాదేవీలో వేలు, లక్షల్లో నగదును ప్రైవేటు వ్యక్తులు అధికారుల ఇళ్లకు చేర్చుతున్నట్లు విచారణలో తేలింది. వెనీవేర్(ఎక్కడి నుంచైనా) రిజిస్ట్రేషన్ అమలులో ఉండడంతో దీని ఆధారంగా అధికారులు సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ వసూళ్లను ప్రైవేటు వ్యక్తులు రాబట్టి రాత్రి వేళల్లో అధికారుల నివాసాలకు చేర్చుతున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ తంతుపై ఆ శాఖ ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిసింది.

***లైసెన్సులు లేకపోవడమే...*** ప్రభుత్వం దస్తావేజు లేఖరులకు పరీక్షలు నిర్వహించి వారికి లైసెన్సులు మంజూరు చేసింది. ప్రతి సంవత్సరం రెన్యూవల్ చేస్తూ 2002లో లైసెన్సులు రెన్యూవల్ చేయకుండా దస్తావేజులు ఎవ్వరైనా వ్రాసుకోవచ్చని ప్రభుత్వం జిఓ విడుదల చేసింది. పర్యవసానంగా ఎవరుపడితే వారు దస్తావేజు లేఖరులై వ్యవస్థ భ్రష్టు పట్టి ప్రైవేటు వ్యక్తుల దందా ఎక్కువైంది. దీంతో అడ్డు అదుపు లేకుండా రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు జరగడం కూడా ఒక కారణం కావచ్చునేమో...!

# ఆర్టీసీ ఎన్నికలలో ఎన్ఎంయూ జెండా

రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా జరిగిన ఆర్టీసీ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో నెల్లూరు జిల్లాలో నేషనల్ మజ్దూర్ యూనియన్ జెండా రెపరెపలాడింది. జిల్లాలో మొత్తం 10 ఆర్టీసీ డిపోలకుగాను 7 డిపోలలో ఎన్ఎంయు విజయం సాధించగా రెండు డిపోలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ పైచేయి సాధించింది. గూడూరు డిపోలో మాత్రం ఎన్ఎంయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్‌కు సమంగా ఓట్లు రావడంతో రెండు యూనియన్‌లను విజేతలుగా ప్రకటించారు. కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, రాపూరు, వెంకటగిరి, వాకాడు, సూళ్లూరుపేటలలో ఎన్ఎంయు గెలవగా, నెల్లూరు 1, 2డిపోలలో ఎస్‌డబ్ల్యూఎఫ్ విజయం సాధించింది. పలు డిపోల వద్ద ఎన్ఎంయూ కార్మికులు పెద్దఎత్తున బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

# సింహపురి వేళలు సరిచేస్తాం

- రైల్వే జిఎం రవీంద్ర గుప్తా

నెల్లూరువాసులకు ఉపయోగంగా ఉన్న సింహపురి రైలు వేళలను ప్రయాణీకులకు అనువుగా ఉండే విధంగా సరిచేస్తామని, ప్రస్తుత వేళలు చాలా ఇబ్బందిగా ఉంటున్నాయని పలువురు ప్రయాణీకులు తమ దృష్టికి తీసుకొచ్చారని, గూడూరులో రాత్రి 8 నుంచి 9గంటల మధ్య బయలుదేరే విధంగా చర్యలు తీసుకుంటామని దక్షిణ మధ్య రైల్వే జిఎం రవీంద్ర గుప్తా పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లోని నాలుగు ప్లాట్‌ఫారాలు, రిజర్వేషన్ కౌంటర్, క్యాంటీన్‌ను ఆయన పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ ప్రయాణీకుల అవసరానికి అనుగుణంగా సదుపాయాల కల్పనకు రైల్వే శాఖ కృషి చేస్తుందన్నారు. మారుతున్న కాలానుగుణంగా రైల్వేలో మరిన్ని సేవలను విస్తృతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రయాణీకులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామన్నారు. చెన్నై - హౌరా మార్గంలో మూడవలైన్ ఏర్పాటుకు ప్రణాళికను సిద్ధం చేయనున్నామన్నారు. బిట్రగుంటలో ఉన్న రైల్వే స్థలాలను ఉపయోగించుకుంటామన్నారు. నెల్లూరు రైల్వేస్టేషన్ చాలా కీలకమని, ఈ క్రమంలో ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.

# ఆర్టీసి బస్సులకు కొత్త స్టాపింగ్ పాయింట్లు

నెల్లూరు ప్రధాన బస్టాండ్ నుంచి హైదరాబాద్, బెంగుళూరులకు వెళ్లే ఆర్టీసి బస్సులకు నగరంలో స్టాపింగ్ పాయింట్లను ఏర్పాటు చేశామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసి ఆర్ఎం జి.మహేశ్వర ఒక ప్రకటనలో తెలిపారు. బెంగుళూరుకు వెళ్ళే అమరావతి బస్‌లకు నిప్పో సెంటర్‌లో వున్న ఏటిపి వద్ద, రాపూరు- హైదరాబాద్ బస్సులకు పొదలకూరు రోడ్డులోని ఇఎస్ఐ ఆసుపత్రి వద్ద, నెల్లూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్ళే బస్సులకు మినీ బైపాస్‌లోని హరిత ఏటిపి పాయింట్ వద్ద స్టాపింగ్‌లు ఏర్పాటు చేశామని, ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# జడ్పీ సమావేశం 6న

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం మార్చి 6వ తేదీ ఉదయం 10.30 గంటలకు నగరంలోని జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో జరుగుతుందని, ఈ సమావేశానికి జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీటిసిలు, ఎంపిటిసిలు, జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొనాలని జడ్పీ సిఇఓ బి. రామిరెడ్డి కోరారు.

sembcorp GAYATRI

# SEMBCORP GAYATRI POWER COMPLEX
## OPENING CEREMONY | 27 FEBRUARY 2016 AT 11:00 AM
KRISHNAPATNAM, NELLORE, ANDHRA PRADESH



## To commemorate 50 years of India-Singapore friendship
A Joint venture between Sembcorp Industries (Singapore) and Gayatri Group (India)
2640 (4x660) Megawatts at a cost of INR 20,000 crores

### INAUGURATION BY



**Shri M. Venkaiah Naidu**
Honourable Union Minister for Urban Development, Housing & Urban Poverty Alleviation and Parliamentary Affairs
Government of India



**Shri Nara Chandrababu Naidu**
Honourable Chief Minister
Government of Andhra Pradesh



**Shri S. Iswaran**
Honourable Minister for Trade and Industry (Industry)
Government of Singapore

### IN THE PRESENCE OF



**Shri Piyush Goyal**
Honourable Union Minister of State with Independent Charge for Power, Coal and New & Renewable Energy
Government of India



**Shri Prakash Javadekar**
Honourable Union Minister of State with Independent Charge for Environment, Forest and Climate Change
Government of India



**Shri YS Chowdary**
Honourable Union Minister of State for Earth Sciences, Science & Technology
Government of India

### PRESIDE BY



**Dr. T. Subbarami Reddy**
Chairman, Committee on Subordinate Legislation, Rajya Sabha
Founder, Gayatri Group, India

### DISTINGUISHED GUESTS



**Shri Ang Kong Hua**
Chairman
Sembcorp Industries, Singapore



**Shri Tang Kin Fei**
Group President & CEO
Sembcorp Industries, Singapore

### GUESTS OF HONOUR

**Shri Raghava Rao Sidda**
Minister For Transport, Roads & Buildings & In-charge Minister Of Nellore
Government Of Andhra Pradesh

**Dr. P Narayana**
Minister For Municipal Administration & Urban Development, Urban Water Supply & Urban Planning
Government Of Andhra Pradesh

**Shri Ghanta Srinivasa Rao**
Minister For Human Resource Development (primary, Secondary, Higher & Technical Education)
Government Of Andhra Pradesh

**Shri B Raghavendra Reddy**
Chairman Zilla Parishad
SPSR, Nellore District
Government Of Andhra Pradesh

### SPECIAL GUESTS

**Shri GP Hinduja**
Co – Chairman
Hinduja Group of Companies

**Shri Shashi Ruia**
Chairman and Co-founder
Essar Group

**Dr. PC Reddy**
Founder Chairman
Apollo Hospitals Group

**Dr. GV Krishna Reddy**
Founder Chairman
GVK Group

**Shri BVR Mohan Reddy**
Chairman
NASSCOM

**Shri J Brij Mohan Reddy**
Vice Chairman
Gayatri projects Limited

**Shri GM Rao**
Group Chairman
GMR Group

**Shri VN Dhoot**
Chairman & Managing Director
Videocon Group

**Shri GV Sanjay Reddy**
Vice Chairman
GVK Group

**Shri CV Rao**
Chairman & MD
Navayuga Group

**Shri AAV Ranga Raju**
Managing Director
NCC Group

### SPECIAL INVITEES

**Dr. KVP Ramachandra Rao, M.P.**
**Shri YV Subba Reddy, M.P.**
**Shri Anam Ramanarayana Reddy,** (Former Finance Minister)
**Shri V Varaprasada Rao, M.P.**
**Shri Mekapati Rajamohan Reddy, M.P.**
**Shri Beeda Ravi Chandra Yadav, MLC, SPSR,** Nellore District
**Shri Vakati Narayana Reddy, MLC, SPSR,** Nellore District

**Shri Somireddy Chandramohan Reddy, M.L.C**
**Shri Kakani Govardhan Reddy, M.L.A.** Sarvepalli
**Shri Kotamreddy Sridhar Reddy, M.L.A.** Nellore Rural
**Shri P Anil Kumar Yadav, M.L.A.** Nellore City
**Shri Adala Prabhakar Reddy** (Ex MLA)
**Smt M Janaki, IAS, Collector & District Magistrate,SPSR,** Nellore District

### INVITED BY

**Shri TV Sandeep Reddy**
Managing Director
Gayatri Group

**Shri Atul Nargund**
Chief Executive Officer
Sembcorp Gayatri Power Complex

# 'ప్రభా'తం

## కొత్త సవాళ్ళు



పార్లమెంట్ సభలంటే దేశప్రగతికి వేదికలు. దేశాభివృద్ధి దృష్ట్యా ప్రజల అభ్యున్నతికి అవసరమైన పథకాల అమలు కోసం చర్చించుకుని వాటిని అమలుకు రూపకల్పన చేయాల్సిన సభలు. అలాంటి విశిష్టమైన సభలను నిర్మాణాత్మకంగా జరగకుండా తరచూ అంతరాయం కలిగిస్తూ, చర్చలకు బదులు రచ్చలకే కొందరు నాయకులు ప్రాధాన్యత ఇస్తూండడం విచారకరం. ప్రధాని మోడీ ఇలాంటి సవాళ్ళను ధీటుగా అధిగమించి, దేశంలో జటిలమవుతున్న సమస్యల పరిష్కారానికి కృషిచేయాల్సి వుంది.

ప్రపంచ స్థాయిలో భారత్ ప్రతిష్టను శిఖరాగ్రాన నిలుపుతూ, తానెక్కడికి వెళ్ళినా అపూర్వమైన ఆదరణతో, ఆయా దేశాల ఆత్మీయతను చూరగొంటూ, ప్రత్యేకించి తన అద్భుతమైన వాగ్ధాటితో ప్రపంచదేశాలను మెప్పించి, దేశప్రగతికి రహదారులు వేసుకుంటూ వస్తున్న ప్రధాని మోడీకి కొత్త సమస్యలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా, ప్రపంచాన్ని అనేక రకాల దౌష్ట్యాలతో, హింసాకాండలతో భయపెడుతున్న ఉగ్రవాదభూతాన్ని తరిమికొట్టాలని, మానవత్వాన్ని మంటకలిపే ఉగ్రవాదాన్ని సమూలంగా పెకలించివేస్తే తప్ప ప్రపంచం నిర్భయంగా మనుగడ సాగించలేదని స్పష్టం చేస్తూ, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశదేశాల మద్దతు కూడగట్టుకుంటూ వస్తున్న నేపథ్యంలో, మనదేశంలోనే ఆయనకు సరికొత్త సవాళ్ళు ఎదురవుతున్నాయి. సమస్యలు సృష్టించేవారు కొందరైతే, వాటికి ఆజ్యంపోసే రాజకీయాల సెగగాలి అవి పెనుమంటలుగా మారేలా చేస్తున్నాయి. అయినా, దేశం ఇప్పుడు క్లిష్ట పరిస్థితుల్లో ఏమీ లేదు. గతంలో వున్న కష్ట పరిస్థితులను అధిగమించే దశలో నిర్విరామంగా కృషిచేస్తూనే వుంది. అన్ని రంగాల్లో వెనుకబడివున్న దేశం ఇప్పుడిప్పుడే పురోగామి దశలోకి వచ్చింది. అందుకు ఏ ఒక్కరో కాదు, ఎంతోమంది మేధావులు, శాస్త్రవేత్తలు, రాజకీయవాదులు, ప్రభుత్వాలు, ప్రజలు.. ఇలా అందరి కృషీ ఇమిడి వుంది. ప్రపంచంలో ఆర్థిక వ్యవస్థలో నానాటికీ సంక్షోభం పెరుగుతూనే వున్నా, మనదేశం మాత్రం ఎంతో మెరుగ్గానే వుండడం ఆ కృషికి నిదర్శనం. స్థూల జాతీయోత్పత్తిలో వృద్ధి కనిపించడం దేశానికి శుభపరిణామం. అంతేకాదు, అటు పారిశ్రామిక రంగంలోనూ దేశంలో మునుపెన్నడూ లేనంత ఉత్సాహం కనిపిస్తోంది. కొత్త పరిశ్రమల స్థాపనకు ప్రపంచదేశాల నుంచి సానుకూల స్పందన వస్తుండడం, దేశం అన్ని రంగాల్లోనూ అభివృద్ధిని సాధించేందుకు మంచి దారి ఏర్పడినట్లయింది. ఇవన్నీ భవిష్యత్తులో దేశానికి ఎంతో ఉపకరించేవే. అయితే, ఇంతలోనే దేశంలో ఎక్కడో ఒకచోట జరిగే కొన్ని ఘటనలు దేశాన్ని మరింత అల్లకల్లోలం చేసేవిధంగా వుంటుండడం ఎంతైనా బాధాకరం. ఏ దేశంలోనైనా సమస్యలన్నవి సహజమే. వాటిని పరిష్కరించుకుంటూ ముందుకు పోవడమే చేయాల్సిందల్లా. అయితే, ఆ సమస్యలు చివరికి దేశభద్రతకే సమస్యగా మారినప్పుడు పరిస్థితి మరింత క్లిష్టంగా తయారవుతుంది. దేశంలో ఇప్పుడు జరుగుతున్నదిదే. మనదేశాన్ని నాశనం చేయాలని కంకణం కట్టుకున్న పాక్ ఉగ్రవాదులు మనదేశ ఆంతరంగిక విషయాల్లోనూ జొరబడుతుండడం, అందుకు మనదేశంలోని కొందరు వత్తాసుగా వ్యవహరిస్తున్నారనే వివాదాస్పద విషయం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా వుంది. ఇంతటి ప్రమాదకరమైన విషయాలను కూడా రాజకీయంగా చూస్తూ..రాజకీయం చేస్తే చివరికి దేశానికే ప్రమాదం కాదా?.. దేశసార్వభౌమత్వానికే మాయని మచ్చ కాదా?.. అయినా.. దేశరక్షణ కోసం ఎంతోమంది వీరజవాన్లు తమ జీవితాలనే త్యాగం చేస్తుంటే, వాటిని విస్మరించి మాతృభూమికీ.. దేశభద్రతకు తూట్లు పొడిచేలా ఎవరు వ్యవహరించినా అది దేశద్రోహం మాత్రమే కాదు.. ఆత్మద్రోహం కూడా అవుతుందని వేరే చెప్పాలా!.. ఇలాంటి సవాళ్ళను ప్రభుత్వం ధీటుగానే ఎదుర్కొంటుందని అనుకోవచ్చు. ఆయా సంఘటనలు ఎప్పుడు.. ఎలా జరిగాయో.. అందుకు కారకులెవరో.. వీటన్నిటి వెనుకవున్న అదృశ్యహస్తాలేమిటో, అసలు ఆ ఘటనల్లో జరిగిందేమిటో.. అందుకు బాధ్యులెవరో తదుపరి విచారణల్లోనో.. న్యాయవిచారణల్లోనో ఎటూ బయటపడక తప్పదు. అయితే, ఈలోగానే 125 కోట్ల మంది ప్రజల అభ్యున్నతి కోసం జరగాల్సిన ముఖ్యమైన పార్లమెంట్ సభలు రచ్చలు రాద్ధాంతాలతోనే గడిచిపోతాయేమోనన్నది ప్రజల ఆవేదన. పార్లమెంట్ సభలంటే..దేశప్రగతికి వేదికలు. సభ్యులంతా దేశాభివృద్ధి దృష్ట్యా ప్రజల అభ్యున్నతికి అవసరమైన పథకాల అమలుకోసం చర్చించుకుని వాటిని అమలుచేసే పథకాలకు రూపకల్పన చేయాల్సిన విశిష్టమైన సభలివి. అయితే, కేవలం వాద వివాదాలతోనే ఆ సభలను పక్కదారి పట్టించడం ఏమాత్రం విజ్ఞతో ఆ విజ్ఞులకే తెలియాలి. ప్రజల మనోభావాన్ని మన పార్లమెంట్ ప్రతిఫలిస్తుందని, ప్రజాస్వామిక స్వభావం, చర్చలు సమాలోచనలను కోరుకుంటుందని, అంతేతప్ప సభల అంతరాయం, అవరోధాలు మంచిదికాదని రాష్ట్రపతి హితవు చెప్పినా, తీరా సభలు ప్రారంభమయ్యేసరికి సభల్లో అదేరకమైన వాతావరణం ఏర్పడుతుండడం ఎంతో విచారకరం. అంతేకాదు, ఉగ్రవాదం ప్రపంచస్థాయి ముప్పు అనీ, ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రపంచ వ్యాప్తంగా దృఢమైన చర్యలు అవసరమనీ రాష్ట్రపతి ఈ సందర్భంగా స్పష్టం చేశారు కూడా. ప్రధాని మోడీ సైతం అదేవిధంగా స్పందిస్తూ, ప్రభుత్వం చేస్తున్న పనుల్లో లోటుపాట్లేమైనా వుంటే కఠినంగా విమర్శించవచ్చునీ, అలా చేయడంవల్ల ప్రజాస్వామ్యం బలోపేతమౌతుందని, నిర్మాణాత్మక చర్చలతో సభలు ఫలప్రదమవుతాయని విపక్షాలకు చెప్తూనే వున్నారు. దేశప్రజల కళ్ళన్నీ సాధారణ బడ్జెట్, రైల్వే బడ్జెట్‌లపై వున్నాయని, మరోవైపు ప్రపంచ ఆర్థిక రంగంలో వున్న స్థాయి కారణంగా ప్రపంచమంతా మన బడ్జెట్ సమావేశాలపైనే దృష్టి సారించిందని, కనుక నిర్మాణాత్మక చర్చలతో సభలను సఫలీకృతం చేయాలని ఆయన విపక్షాలకు వినమ్రంగా విజ్ఞప్తి చేశారు కూడా. అయినా, అంతటి గౌరవనీయమైన విన్నపాలను కూడా తోసిరాజని ప్రభుత్వం మీద కేవలం విమర్శలే ధ్యేయంగా కొంతమంది నాయకులు మాట్లాడుతుండడం విచారకరం.

అయినా, సమస్య ఎంతటి జటిలమైనదైనా సుహృద్భావ వాతావరణంలో అందరూ కలసి కూర్చుని చర్చించుకుంటేనే పరిష్కారమార్గం సులువుగా దొరుకుతుందే కానీ, సభల్లో చర్చలు సాగకుండా రచ్చలతోనే కాలం గడిపితే, పుణ్యకాలం కాస్తా వ్యర్థమైపోయి, సమస్య మరింత జటిలమవుతుందే తప్ప చివరికి సాధించేదేమీ వుండదు. రాష్ట్రపతి సూచించినట్లుగా, పార్లమెంట్‌లో సభ్యులంతా వారి బాధ్యతలను సహకార స్ఫూర్తితో, పరస్పరం ఇచ్చిపుచ్చుకునే ధోరణితో నిర్వర్తించడం సముచితమైన మార్గం. ఇకనైనా ఆ దిశలో పార్లమెంట్ సభలు సజావుగా సాగుతాయని.. సాగాలని ఆశిద్దాం!..

# పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు



ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు పటిష్టమైన ఏర్పాట్లు చేసి విజయవంతం చేయాలని అదనపు జాయింట్ కలెక్టర్ ఆర్.ఎస్.రాజ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షలు వ్రాసే విద్యార్థులకు ఆయా సెంటర్ల వారీగా అవసరమైన సౌకర్యాలు కల్పించి ఎలాంటి సమస్యలు లేకుండా జరిగేలా చూడాలన్నారు. జిల్లాలో 93సెంటర్లలో 58,075మంది ఇంటర్ విద్యార్థులు హాజరవుతున్నారని, అందులో మొదటి సంవత్సరం ఇంటర్ విద్యార్థులు 30,348 మంది, ద్వితీయ సంవత్సర ఇంటర్ విద్యార్థులు 27,733మంది హాజరవుతారని తెలిపారు. ఈ పరీక్షలు మార్చి 2వ తేదీ నుండి 16వ తేదీ వరకు ఉదయం 9.00గంటల నుండి మధ్యాహ్నం 12.00గంటల వరకు జరుగుతాయని, దీనిని దృష్టిలో వుంచుకొని విద్యార్థులు ఉదయం 8.45గంటలకల్లా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షహాలులోకి అనుమతించరని తెలిపారు. ఈ పరీక్షలకు 1400మంది ఇన్విజిలేటర్స్, 4ఫ్లయింగ్ స్క్వాడ్లు, 4సిట్టింగ్ స్క్వాడ్లు నియమించడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ విధించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి డి.ఆంజనేయులు, డిఇసి కన్వీనర్ ఎన్.బాబుజాకబ్, జిల్లా డివిఇఓ వెంకయ్య, వైద్యశాఖాధికారి ఓ.వీరప్రతాప్, హైపవర్ కమిటి సభ్యులు వెంకటసుబ్బయ్య, కమిటి సభ్యులు వరప్రసాద్, పెంచలయ్య, చంటిరాజు తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఐసిఏ జిల్లా ఛైర్మెన్‌గా మురళీమోహన్‌రాజు




మచిలీపట్నం శ్రీ మహతి లలిత కళా వేదికలో ఈ నెల 20వ తేదీ ఇండియన్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 13జిల్లా శాఖల ఛైర్మెన్లను ఎంపిక చేసింది. నెల్లూరు జిల్లాకు సంబంధించి ఇండియన్ కల్చరల్ అసోసియేషన్ ఛైర్మెన్‌గా యువకవి కె.మురళీమోహన్ రాజును నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, మచిలీపట్నం మునిసిపల్ ఛైర్మెన్ మోటమర్రి వెంకటబాబా ప్రసాద్, కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, ఇండియన్ కల్చరల్ అసోసియేషన్ ఫౌండర్ భవిష్య, కొత్తగూడెం క్లబ్ కార్యదర్శి డా॥ వాసిరెడ్డి రమేష్‌బాబు తదితరులు పాల్గొని నూతన ఛైర్మెన్‌లను అభినందించారు.

## విలువలు లేని నేతలు

రాజకీయ నాయకులకు డబ్బే పరమావధిగా మారుతోంది. డబ్బు సంపాదన కోసం విలువలను వదిలేస్తున్నారు. నిన్న గెలిచిన పార్టీని ఈరోజు వదిలేస్తున్నారు. అదేమంటే నా నియోజకవర్గం అభివృద్ధి కోసం అధికార పార్టీలో చేరుతున్నామంటున్నారు. అధికారపార్టీలో ఉంటేనే అభివృద్ధి పనులు చేయగలరా? అలాంటప్పుడు ఏ రాష్ట్రంలోనైనా ప్రతిపక్షం ఎందుకు? ప్రజాతీర్పును శిరసావహించిన ఇలాంటి నేతలకు మళ్ళీ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి.

**దండు నాగిరెడ్డి, దుత్తలూరు.**

## తీవ్రవాదులను పోషించడమే!




ఢిల్లీలోని జెఎన్‌యు... హైదరాబాద్‌లోని హెచ్‌సియు... ఇలాంటి విశ్వవిద్యాలయాలలో జరిగిన సంఘటనలు చూస్తే అసహ్యమేస్తోంది. భావ ప్రకటన స్వేచ్ఛా పేరుతో ఉగ్రవాదులకు మద్దతు పలుకుతున్న విద్యార్థులు కొందరైతే, వారికి వంతపాడుతున్న కుహనా లౌకికవాద నాయకులు మరికొందరు. ఈ దేశ ప్రజలు కట్టే పన్నులతో అక్కడ విద్యార్థులు చదువుతున్నారు. ఈ దేశ ప్రజల తిండి తింటున్నారు. అక్కడ ప్రొఫెసర్లకు జీతాలిచ్చేది ఈ దేశ ప్రజలే... కాని అక్కడి విద్రోహులు ఈ దేశం మీదే విషం చిమ్ముతున్నారు. దేశ విభజన శక్తులుగా తయారవుతున్నారు. నరహంతక ఉగ్రవాదులకు వత్తాసు పలుకుతున్నారు. ఇలాంటి ద్రోహులను ఉరితీసినా పాపం లేదు. చీడ పురుగుల నిలయాలవుతున్న అన్ని విశ్వవిద్యాలయాలను కూడా ప్రక్షాళన చేసి వాటిని దేశభక్తి పెంపొందించే కేంద్రాలుగా మలచాలి.

**వి.రవి, హైదరాబాద్.**

## జాతీయ వాదమంటే హిందుత్వమేనా?

జాతీయ జెండా ఎగురవేయమంటే ఇది హిందుత్వవాదుల కుట్ర అంటారు. దేశ వ్యతిరేక నినాదాలు చేసినవారికి నాలుగు తగిలిస్తే ఇది ఆరెస్సెస్ ఫాసిజం అంటారు. అంటే జాతీయ జెండాను గౌరవించడం, దేశ వ్యతిరేకులకు బుద్ధి చెప్పడం కేవలం హిందువులు, ఆరెస్సెస్ వారికే సొంతమా? కాంగ్రెస్, ఆప్, వామపక్షాలకు ఈ దేశం పట్ల, ఈ దేశ గౌరవం పట్ల బాధ్యత లేదా? రాహుల్‌గాంధీ, అరవింద్ కేజ్రీవాల్‌లు మరీ చీడపురుగులయ్యారు. దేశ వ్యతిరేక శక్తులను నిలదీయాల్సిందిపోయి, జాతీయవాదం వినిపిస్తున్న వారిపై తమ పోరాటాలు చేస్తున్నారు. రాహుల్‌గాంధీ, అరవింద్ కేజ్రీవాల్‌లు ఈ దేశంలో భాగం కాదేమో!

**ముప్పాళ్ల నారాయణ, నెల్లూరు.**

# కళ్యాణ వైభోగం...!




వరుణ్ - దివ్య



కోవూరు శాసనసభ్యులు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి - అరుణల కుమార్తె **దివ్య - వరుణ్** (హైదరాబాద్ వాస్తవ్యులు బల్లవరం వెంకటప్రతాప్‌రెడ్డి - విద్యల కుమారుడు)ల కల్యాణం ఫిబ్రవరి 19వ తేదీ నెల్లూరులోని కెజికె కల్యాణ మండపంలో జరుగగా, రిసెప్షన్ వేడుకలు 21తేదీ రాత్రి హైదరాబాద్‌లోని సంధ్య కన్వెన్షన్‌సెంటర్‌లో ఎంతో వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, ఏపి శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాద్‌తో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు పెద్దసంఖ్యలో హాజరై వధూవరులను ఆశీర్వదించారు. నూతన దంపతులకు 'లాయర్' శుభాభినందనలు.

### కొత్త నేతలకు మార్గాలు

# పెరుగుతున్న నియోజకవర్గాలు




2019 ఎన్నికల నాటికి రాష్ట్ర శాసనసభ స్థానాలు 175 నుండి 225కి పెరుగుతాయని తెలుస్తోంది. ఈమేరకు కేంద్రం నుండి సంకేతాలు రాగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నోట సైతం ఆ మాట రావడం విన్నాం. నియోజకవర్గాలు పెరగడం అంటే కొత్త తరం నేతలను ఆహ్వానించడమే.

రాష్ట్రంలో 50నియోజకవర్గాలు పెరిగితే నెల్లూరుజిల్లాలోనూ మూడు పెరిగే అవకాశాలున్నాయి. ప్రస్తుతం 10 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. 2009కి ముందు జిల్లాలో 11 అసెంబ్లీలుండగా ఆ యేడాది జరిగిన డీ-లిమిటేషన్‌లో అల్లూరు, రాపూరు నియోజకవర్గాలు పోయి నెల్లూరురూరల్ పేరుతో కొత్త నియోజకవర్గం వచ్చింది. 11అసెంబ్లీలు పదే అయ్యాయి. ఇప్పుడు కొత్తగా 3 నియోజకవర్గాలు ఏర్పడితే అవి ఏవేవి కావొచ్చన్నది ఒక చర్చగా మారింది. నెల్లూరు నగరం, పరిసర గ్రామాలతో కలిసి సిటీ, రూరల్ నియోజకవర్గాలున్నాయి. పెరిగిన జనాభాను దృష్టిలో పెట్టుకుని నెల్లూరు నుండే మరో నియోజకవర్గాన్ని ఏర్పాటు చేసే అవకాశముంది. వెంకటగిరి, సర్వేపల్లి నియోజకవర్గాల నుండి నాలుగు మండలాలను విడదీసి పాతరాపూరు అసెంబ్లీని పునరుద్ధరించే అవకాశాలనూ కొట్టిపారేయలేము. ఒకవేళ రాపూరు లేకుంటే నాయుడుపేటను కూడా అసెంబ్లీగా మార్చే ఛాన్సుంది. ఇక పాత అల్లూరు అసెంబ్లీని పునరుద్ధరించడంగాని లేదా ఉదయగిరిని విడదీసి కొత్తగా వింజమూరు అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయడంకాని చేయవచ్చు. అల్లూరును తిరిగి ఏర్పాటు చేయాలంటే కావలి, కోవూరు నియోజకవర్గాల నుండి కొన్ని మండలాలను విడదీయాలి. దీనికంటే కూడా ఉదయగిరి నియోజకవర్గం 8మండలాలతో వుంది. దీనిని చీల్చి కొత్త నియోజకవర్గం ఏర్పాటు చేయడం కరెక్ట్. జిల్లాలో నియోజకవర్గాలు పెరిగితే పెద్దపార్టీలకు సీట్ల సమస్య చాలావరకు తగ్గుతుంది. సీట్ల సర్దుబాటును బాగానే చేయొచ్చు. నియోజకవర్గాలు చిన్నవిగా వుంటే అభ్యర్థులకు తిరిగే ప్రయాసతో పాటు ఓట్ల కొనుగోలు వ్యయం కూడా బాగానే తగ్గుతుంది.

# జగన్‌కు పిచ్చెక్కింది

**- ఎమ్మెల్సీ సోమిరెడ్డి**



జగన్‌కు పూర్తిగా మతి భ్రమించిందని, తాను ఏం మాట్లాడుతున్నాడో ఏం చేస్తున్నాడో అర్థంకాని పరిస్థితిలో వ్యవహరిస్తున్నాడని తెలుగుదేశంపార్టీ జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నెల 20వ తేదీ నెల్లూరులోని టిడిపి కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ జగన్ అవినీతి సొమ్ముతో స్థాపించిన మీడియాలో ప్రతిరోజూ టిడిపి ప్రభుత్వంపై, ముఖ్యమంత్రిపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని, రాష్ట్రం అభివృద్ధి చెందడం, పరిశ్రమలు రావడం, బడుగు బలహీనవర్గాలు ఆర్థికంగా బలోపేతం కావడం, విద్యార్థి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించడం జగన్‌కు ఇష్టం లేదన్నారు. నవ్యాంధ్రలో చాలామంది ఎమ్మెల్యేలు జగన్ అహంకారంతో విసిగిపోయి టిడిపిలోకి రావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. వారిని కట్టడి చేసుకోవడం చేతగాక ముఖ్యమంత్రి కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి కొంటున్నారని మాట్లాడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మరికొన్నాళ్లలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ స్వయంకృతంతో కాలగర్భంలో కలిసిపోతుందన్నారు.

# త్వరలో వైకాపా షట్టర్ క్లోజ్

**- వివేకా**



త్వరలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయం మూతపడబోతుందని మాజీఎమ్మెల్యే, ఆరణాల తెలుగుదేశం నాయకులు ఆనం వివేకానందరెడ్డి విమర్శించారు. మొన్నటివరకు చంద్రబాబు మీద, ఆ పార్టీ నాయకుల పైన ఒంటి కాలితో లేచిన వివేకా తెలుగుదేశంలో చేరింది మొదలు అదే నాయకుల మీద ఈగను కూడా వాలనీయడం లేదు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాల మధ్య ఎలాంటి వివాదాస్పద సంఘటన చోటుచేసుకున్నా జగన్ మీదకు ఒంటికాలిపై లేచే వారిలో వివేకా ముందుంటున్నాడు. నలుగురు వైసిపి ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ తెలుగుదేశంపార్టీలో చేరిన నేపథ్యంలో పరస్పర విమర్శల మంటలు రేగడం జరిగింది. ఈ మంటల్లో నావంతు ఆజ్యం పోస్తానంటూ వివేకా 23వ తేదీన నెల్లూరులోని ఏసి సెంటర్‌లో విలేకరుల సమావేశం పెట్టాడు. జగన్‌ను నోరారా మరోసారి తిట్టాడు. జగన్ మీద ఆ పార్టీలోని నాయకులకే నమ్మకం లేదు. 2014ఎన్నికల్లో కౌంటర్‌లు పెట్టి మరీ సీట్లు అమ్ముకున్నాడు. కోట్లు పెట్టి సీట్లు కొన్నవాళ్లు ఆయన వద్ద నిలవలేకున్నారు. చంద్రబాబు మీద నమ్మకంతో తెలుగుదేశంలో చేరుతున్నారు. 2019ఎన్నికల నాటికి వైసిపి వుండదు. ఉన్నా ఆ పార్టీకి అభ్యర్థులు దొరకరు. బాధ్యతాయుత ప్రతిపక్ష నేతగా జగన్ ఎప్పుడూ వ్యవహరించలేదు. రాష్ట్రం ఇప్పుడున్న పరిస్థితుల్లో జగన్ ముఖ్యమంత్రి అయ్యుంటే సర్వనాశనం అయ్యేవాళ్లమని, చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండడం ఈ రాష్ట్ర ప్రజల అదృష్టమని వివేకా పేర్కొన్నాడు.

# గర్భసంచి ముఖద్వారం కేన్సరు గురించి అవగాహన

Apollo SPECIALITY HOSPITALS
TOUCHING LIVES

**Dr. U.V. Rohini**
M.B.B.S., MS a(OBG & GYN)
OBS & GYNAECOLOGY
Consultant Gynaecologist
Apollo Speciality Hospitals
NELLORE



గర్భసంచి ముఖద్వారం కేన్సరు నూరు శాతం మనం నివారించగలం. ఈ కేన్సరును ముందుగా తెలుసుకొనుటకు కొన్ని పరిక్షలు కలవు. ఈ కేన్సరుకు కారణమైన వైరసు పేరు హ్యూమన్ ప్యాపిల్లోమా వైరసు. ఈ వైరసు నుంచి రక్షించుకొనుటకు మనకు అందుబాటులో వేక్సిను కలదు. ఈ కేన్సరును ముందుగా తెలుసుకొనుటకు స్క్రీనింగు టెస్టులు కలవు. వాటి పేర్లు 1. పేప్స్మియర్(Papsmear), 2. H.P.V.DNA Test

ఈ స్క్రీనింగ్ టెస్టులు స్త్రీల వయస్సు 21సం॥ల నుండి ప్రతి 3సం॥ల కొకసారి 65సం॥ల వరకు నిర్వహించబడును. ఈ స్క్రీనింగు టెస్టు వలన కేన్సరుకు ముందు వచ్చే కారణాలను కనుగొని ముందుగానే ట్రీట్‌మెంటు నిర్వహిస్తే తరువాత కరెంటు మరియు మందులు వాడే అవసరం ఉండదు.

ఈ కేన్సరు వైరసు వలనే కాకుండా చిన్న వయసులోని పెళ్ళిళ్ళు అయిన వారికి ఎక్కువ మంది పిల్లలున్న వారికి, ఎక్కువ కాలం గర్భనిరోధక మందులు వాడిన వారికి ఈ కేన్సరు వచ్చే అవకాశం ఎక్కువ.

***ఈ కేన్సరుకి సంబంధించిన లక్షణాలు ఈ విధంగా ఉంటాయి.***

గర్భసంచి ముఖద్వారం నుంచి బ్లీడింగు రావడం, చెడువాసన రావడం, కడుపునొప్పి రావడం. ఈ కేన్సరును నివారించడానికి వేక్సిన్సు లభ్యమవుతున్నాయి. ఈ వేక్సిన్సు ఆడపిల్లల వయస్సు 11 లేక 12సం॥లు వయస్సు నుండి వేసుకోవచ్చు. ఈ వేక్సిన్సు 3 ఇంజక్షన్సుగా 6 నెలలు వరకు వాడవచ్చును.

### Self Breast Examination

✓ ప్రతి నెల బహిస్టు తరువాత స్థనాలు ఎవరికి వారే తడిమి పరీక్ష చేసుకోవాలి. గడ్డలు, కదుములు ఉన్నట్లు అనిపిస్తే వెంటనే డాక్టరును సంప్రదించాలి.

✓ Mammogram:- ఇది బ్రెస్ట్‌కి చేసే X-Ray. ఈ టెస్టు ద్వారా బ్రెస్ట్ క్యాన్సర్‌ని ముందుగానే కనుక్కోవచ్చు. ఈ టెస్టు ఆడవాళ్ళు 45సంవత్సరాల నుండి ప్రతి 5సంవత్సరాలకు ఒకసారి చేయించుకోవాలి. అదే కనుక ఇంట్లో ఎవరికైనా క్యాన్సర్ హిస్టరీ వుంటే, 35సంవత్సరముల నుండి ప్రతి 5సంవత్సరములకు ఒకసారి 85సంవత్సరాల వరకు చేసుకోవాలి.

### *గర్భిణీ స్త్రీకి సూచనలు*

✓ గర్భధారణ సమయంలో మానసికంగా చక్కటి ఆలోచనలు కలిగి ఉండటం ఎంతో అవసరం.

✓ సాధ్యమైనంత వరకు ఎలాంటి ఆందోళనలు లేకుండా మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవలెను.

✓ గర్భవతి 9నెలల్లో కనీసం 7 నుండి 8సార్లు క్రమం తప్పకుండా డాక్టర్ గారిని సంప్రదించాలి.

✓ డాక్టరు సలహా లేకుండా ఎటువంటి మందులు వాడరాదు.

✓ గర్భిణీ స్త్రీలు మొదటి 3నెలలు, చివరి 3నెలలు దూర ప్రయాణాలు మరియు వాహనాలు నడపడం చేయరాదు.

✓ మొదటి మూడు నెలల్లో రక్తస్రావం అయినా, కడుపునొప్పి ఉన్నా వెంటనే డాక్టరును సంప్రదించాలి.

✓ (సూచనలు - తలనొప్పి వాంతులు, కళ్ళు మసకలు, ఒళ్ళు వాపులు)

✓ కడుపు నొప్పి ఉమ్మనీరు పోవడం బ్లీడింగ్ ఉన్నచో వెంటనే డాక్టరును సంప్రదించాలి.

✓ ఆరోగ్యకరమైన బిడ్డ కొరకు ఎక్కువగా ఆకుకూరలు, పండ్లు, పాలు, పప్పు దినుసులు వంటి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలి.

✓ బిడ్డ యొక్క పెరుగుదల తల్లి తీసుకొను ఆహారం పైన ఆధారపడి ఉంటుంది.

✓ మసాలాలు, కారం, ఉప్పు, నూనె పదార్ధములు వీలైనంత తక్కువగా తీసుకోవాలి.

✓ బిడ్డ యొక్క కదలికలను గమనించుకోవాలి, కదలికలు తక్కువుగా అనిపిస్తే వెంటనే డాక్టరును సంప్రదించాలి.

✓ ప్రతిరోజు తగినంత వ్యాయామం (వాకింగ్) చేయడం మంచిది.

# అక్కా తమ్ముళ్ల అనుబంధానికి శిఖరమే శిరస్సు వంచింది!



**మల్లి మస్తాన్‌బాబు... భారతదేశ కీర్తిపతాకాన్ని ఎగురవేసిన పేరు. ఎటువంటి కీర్తిని ఆశించని పేరు. దేశకీర్తి, ప్రతిష్ఠలను ప్రపంచానికి చాటిన పేరు. మూడురంగుల జెండాను ప్రపంచంలోనే ఎత్తైన ఏడు శిఖరాల శిరస్సులపై నాటిన పేరు. దేశం నుండి అతను పొందింది కొంత... దేశం కోసం అతను చేసింది కొండంత. ఈ పేరు వింటేనే ఒక గొప్ప భావన కలుగుతుంది. స్ఫూర్తికి, కీర్తికి నిలువెత్తు నిర్వచనం మల్లి మస్తాన్‌బాబు.**

నెల్లూరుజిల్లా సంగం మండలంలోని గాంధీ గిరి జన సంఘం(ర్యాంపు)కు చెందిన మల్లి మస్తాన్‌బాబు గత యేడాది మార్చిలో అర్జెంటీనాలోని 'ఆండీస్' పర్వతారోహణ సమయంలో వచ్చిన తుఫాను మూలంగా మరణించడం తెలిసిందే! ఏడు సంవత్సరాలలో ప్రపంచంలోని ఏడు ఎత్తయిన పర్వతాలను అధిరోహించాలనే లక్ష్యంతో మస్తాన్‌బాబు ఆరు పర్వతాలను అధిరోహించి మువ్వన్నెల జెండాను వాటి శిరస్సుపై నాటాడు. ఏడో పర్వతమైన ఆండీస్‌ను అధిరోహించే సమయంలో ఆయన మంచు తుఫాన్‌లో చిక్కుకుని తుదిశ్వాస విడిచాడు. మల్లి మస్తాన్‌బాబు అనే శిఖరవీరుడి సాహసం గురించి ఈ ప్రపంచానికి తెలిసింది అతని మరణం తర్వాతే!

మన దేశంలో రాజకీయ నాయకులను అభిమానిస్తారు, సినీ హీరోలను, క్రికెట్ స్టార్‌లను ఆరాధిస్తారు. ఇటీవల మానవహననానికి పాల్పడే ఉగ్రవాదులను కూడా పూజించే వాళ్లు తయారయ్యారు. కాని దేశం నుండి ఏమీ ఆశించకుండా ఎందులోనూ భారతీయులు తగ్గరని, పర్వతారోహణలోనూ మేం ముందుంటామని చాటిచెప్పిన మల్లి మస్తాన్‌బాబు ప్రతిభాపాటవాల గురించి మనం తెలుసుకునేటప్పటికి మన ఎదుట ఆ మనిషే లేకుండా పోయాడు.

మరణం అన్నది మనిషి దేహానికే కాని ఆ మనిషిలోని ఆశయాలకు కాదని మస్తాన్‌బాబు సోదరి డాక్టర్ మల్లి దొరసానమ్మ నిరూపించారు. తన తమ్ముడు మస్తాన్‌బాబును అడ్డుకుని తుఫాన్‌రూపంలో అతని ప్రాణాన్ని కబళించిన ఆండీస్ పర్వతంపై ఆమె కాలుమోపింది. ఆమె పట్టుదలకు ఆండీస్ శిఖరం శిరసు వంచింది. ఆండీస్ పర్వతంపై తన తమ్ముడు ఎగురవేయాలనుకున్న భారత జెండాను దొరసానమ్మ ఎగురవేసి తన తమ్ముడికి నిజమైన నివాళి అర్పించింది.

గత యేడాది మార్చిలో మల్లి మస్తాన్‌బాబు మరణవార్త తెలుసుకున్న దొరసానమ్మ వెంటనే అర్జెంటీనాకు వెళ్లింది. తన తమ్ముడి మృతదేహాన్ని తాకిన క్షణాలలో మస్తాన్‌బాబు అధిరోహించాలనుకున్న ఆండీస్ పర్వతాన్ని తాను అధిరోహించాలనే ఆలోచన కలిగింది. మస్తాన్‌బాబు మృతదేహాన్ని ఇండియాకు తీసుకొచ్చి కార్యక్రమాలు ముగిసాక ఏడాదిలోపు ఆండీస్ పర్వతాన్ని ఎక్కితీరాలని దొరసానమ్మ పంతం పట్టింది. ఆమె తిరుపతిలోని 'స్విమ్స్'లో డాక్టర్‌గా పనిచేస్తుంది. పర్వతారోహణకు అవసరమైన శిక్షణను ఆమె శ్రీవారి సన్నిధికి వెళ్ళే 'మెట్టు' మార్గంలోనే తీసుకుంది. తీరిక దొరికినప్పుడల్లా ఆ కొండను ఎక్కుతూ ప్రాక్టీస్ చేసింది. ఆమెకు పర్వతారోహణలో అనుభవం లేకపోయినా కేవలం తమ్ముడి ఆశయం నెరవేర్చాలన్న సంకల్పబలంతోనే జనవరి 14న చెన్నై నుండి అర్జెంటీనాకు బయలుదేరింది. ఫ్లైట్ ఎక్కేముందు తన తల్లికి ఫోన్ చేసి విషయం చెప్పింది. అమ్మ వద్దన్నా కళ్లముందు తమ్ముడు కదలాడడంతో దొరసానమ్మ ఒప్పుకోలేదు. ఏమీ కాదమ్మా అంటూ అమ్మకు ధైర్యం చెప్పి విమానం ఎక్కింది. వెళ్లేముందు కుటుంబసభ్యులకు ఓ లెటర్ వ్రాసింది. ఈ సాహసయాత్రలో తనకేదన్నా జరగరానిది జరిగితే తదుపరి ఏం చేయాలనేది ఆమె ఆ లేఖలో పేర్కొంది. మస్తాన్‌బాబు స్నేహితుడు, పర్వతారోహకుడైన హెర్నాన్, మరో ఐదుమందితో కలిసి దొరసానమ్మ ఆండీస్ పర్వతారోహణకు పూనుకున్నారు. అతికష్టం మీద ఆండీస్ శిఖరం అంచులకు చేరుకున్నారు. మస్తాన్‌బాబు మృతి చెందిన చెర్రోట్రస్ట్ కోసెన్ ప్రాంతాన్ని చూసారు. తన తమ్ముడు ప్రాణాలొదిలిన ప్రాంతాన్ని చూడగానే ఆమెలో భావోద్వేగం... కళ్లల్లో నీళ్లు... మస్తాన్‌బాబు అక్కడే వున్న ఫీలింగ్... ఓ వైపు తమ్ముడి ఆశయాన్ని పూర్తి చేసానన్న ఆనందం... ఇంకో పక్క తమ్ముడి జ్ఞాపకాలు... అక్కడే ఆమె భారతీయ జెండాతో పాటు తన తమ్ముడు చదువుకున్న కోరుకొండ సైనిక స్కూల్ జెండాను కూడా నాటారు. తర్వాత ఇంకో వెయ్యి మీటర్లు ఎత్తుకెళ్లి తన తమ్ముడి ఆశయాన్ని పరిపూర్ణంగా నెరవేర్చారు. అర్జెంటీనా నుండి తిరిగి రావడంతోనే నేరుగా మస్తాన్‌బాబు సమాధి వద్దకు వెళ్ళి... తమ్ముడూ... ఈ అక్క నీ కోసం ఇంతకంటే ఏం చేయగలదు... నీ ఆత్మశాంతికి ఇదేనా నివాళి అంటూ అంజలిఘటించారు.

### పాఠ్యాంశంగా మస్తాన్‌బాబు చరిత్ర

పర్వతారోహకుడు మల్లి మస్తాన్‌బాబు చరిత్రను పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయం. ఈ యేడాది విద్యాసంవత్సరం నుండి 8వ తరగతి తెలుగు ఉపవాచక పుస్తకంలో స్ఫూర్తి ప్రదాతలు శీర్షికలో మల్లి మస్తాన్ బాబు చరిత్రను అలాగే మైక్రోసాఫ్ట్ సిఇఓ సత్య నాదెళ్ల చరిత్రను ప్రచురించనున్నారు.

## ఐఎన్‌టిఎస్‌ఓలో శ్రీ చైతన్య ప్రభంజనం



నెల్లూరు వనంతోపు సెంటర్‌లోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ఐఎన్‌టి ఎస్‌ఓలో ప్రభంజనం సృష్టించారు. 24వ తేదీ విడుదలైన ఐఎన్‌టిఎస్‌ఓ ఫైనల్ ఫలితాలలో పాఠశాల నందుగల 7వ తరగతి చదువుతున్న శశాంక్ ఆల్ ఇండియా 8వ ర్యాంక్ సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అదేవిధంగా 9వ తరగతి చదువుతున్న సాయి ఆరతి, దీపిక, జోత్స్న, 8వ తరగతి చదువుతున్న శివాణి, 5వ తరగతి చదువుతున్న వెంకటసాయి వరుణ్ గోపాల్‌లు కూడా బంగారు బహుమతులను, మెరిట్ సర్టిఫికెట్‌లను సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎజిఎం హనుమంతరావు, ఆర్ఐ కొండారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌లు విద్యార్థులను అభినందించి బహుమతులను అందజేశారు.

## బీచ్ కబడ్డీలో నెల్లూరు ఫస్ట్

బుచ్చిరెడ్డిపాళెంలోని డివిఎల్ఎన్ఆర్ కళాశాల ఆవరణంలోని మల్లి మస్తాన్‌బాబు క్రీడా ప్రాంగణంలో ఇటీవల జరిగిన అంతర్ జిల్లా బీచ్ కబడ్డీ పోటీల్లో నెల్లూరు జట్టు ప్రథమస్థానం సాధించి అందరి ప్రశంసలూ అందుకుంది. మూడు రోజులపాటు ఎంతో ఉత్కంఠభరితంగా జరిగిన ఈ పోటీల్లో నెల్లూరు జట్టు ఎంతో ప్రతిభతో ఆడుతూ ఫైనల్స్‌కు చేరుకుంది. ఫైనల్స్‌లో ప్రకాశం జిల్లా జట్టుతో పోటాపోటీగా తలపడి నెల్లూరుజట్టు విజయభేరీ మోగించింది. ఈ పోటీల్లో ప్రకాశం, గుంటూరు జట్లు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. అదేవిధంగా, మహిళల విభాగంలో విశాఖ జట్టు ప్రథమ స్థానం సాధించగా, పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లా జట్లు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. ఈ పోటీల్లో ఆల్‌రౌండర్‌గా పురుషుల విభాగంలో నెల్లూరు జట్టుకు చెందిన సురేష్, మహిళల విభాగంలో విశాఖకు చెందిన గాయత్రి అందరి ప్రశంసలూ అందుకున్నారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్, సింహపురి స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా కబడ్డీ క్రీడాకారులు మరింత ప్రతిభతో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఖ్యాతి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బుచ్చి స్పోర్ట్స్‌క్లబ్ గౌరవాధ్యక్షుడు సూరా శ్రీనివాసులురెడ్డి, అధ్యక్షుడు ఎల్లసిరి దేవదానం, ప్రధాన కార్యదర్శి శివప్రసన్నతో పాటు పిఇటిలు బి. రమణయ్య, మహేష్, సుబ్బయ్య, శరత్, మల్లి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు లయన్స్‌క్లబ్ సేవలు

లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు (పినాకిని) చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం నెల్లూరు సంతపేటలోని ఓబయ్య బడి, ఆందాళమ్మ బడిలో వున్న విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కళ్ళద్దాలు పంపిణీ చేశారు. స్థానిక మోదరన్ ఐ ఆసుపత్రి సిబ్బంది ఈ వైద్య పరీక్షలు నిర్వహించగా, లయన్స్‌క్లబ్ పూర్వాధ్యక్షుడు డివి శరత్‌బాబు, కోశాధికారి పి.సత్యనారాయణ, సభ్యులు పి.సీతారాంతో పాటు ఆ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వికలాంగుల గుర్తింపులో నిర్లక్ష్యం వద్దు

వికలాంగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, వారికి గుర్తింపు పత్రం అందజేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం ఏమిటంటూ ప్రభుత్వ వైద్యకళాశాల, బోధన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ చాట్ల నరసింహారావు అక్కడి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నగరంలోని బోధనాసుపత్రి పరిధిలో వికలాంగుల గుర్తింపు కేంద్రాన్ని ఆయన డైరెక్టర్లతో కలసి పరిశీలించారు. అక్కడ నమోదు చేసుకున్నవారికి ఎంతకాలంలో గుర్తింపు పత్రం ఇస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. బాధితులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. వికలాంగులు గుర్తింపు కోసం రోజుల తరబడి తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల వికలాంగులు మరెన్నో బాధలు పడుతున్నారని ఆయన అన్నారు. గుర్తింపు పత్రాలు సిద్ధమైనప్పటికీ వైద్యులు సంతకాలు చేయకుండా రోజుల తరబడి వికలాంగులను తిప్పించుకుంటున్నారని, దీనివల్ల వందల సంఖ్యలో ధృవీకరణ పత్రాలు ఇక్కడి కేంద్రంలో మగ్గిపోతున్నాయని అన్నారు. ఈ విషయాన్ని మంత్రి నారాయణ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ఓ.సంపత్‌రాజు, కార్పొరేటర్ వహీదా, టిడిపి నేత గిరి, వికలాంగుల సంఘం రాష్ట్ర నాయకుడు ఆవుల నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రంగనాధుని సేవలో అహోబిలమఠం పీఠాధిపతి



అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీరంగనాథ యతీంద్ర మహాదేశికర్ స్వామీజీ ఈ నెల 21వ తేదీన నెల్లూరుకు విచ్చేసి శ్రీ రంగనాధాలయాన్ని దర్శించుకుని, శ్రీరంగనాధునికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ కార్యనిర్వాహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి జగన్నాధాచార్యులు, నిషింద సుదర్శనాచార్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆ తర్వాత శ్రీరంగనాధస్వామి ఆలయం ఎదురుగా వున్న గోపురం వీధిలోని శ్రీ వేదాంత దేశికర్ దేవస్థానాన్ని సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామీజీ భక్తులతో మాట్లాడుతూ, భగవంతుడు వివిధ రూపాల్లో అవతరించాడని, నిత్యం భగవన్నామ స్మరణతో భక్తులు తమ జీవితాలను ధన్యం చేసుకోవాలన్నారు. దేవస్థానం అర్చకులు కెపి వరదరాజన్, రవి, బాలాజీ, హరికృష్ణ తదితరులు స్వామీజీకి స్వాగతం పలికారు.

## రోలర్ స్కేటింగ్‌లో చిన్నారుల ప్రతిభ

రాష్ట్ర, జాతీయస్థాయిలో జరిగిన ఆర్ఎస్ఎఫ్ఐ, ఎస్‌జిఎఫ్ఐ, సిబిఎస్ఇ పోటీల్లో అత్యంత ప్రతిభతో పతకాలు సాధించిన జిల్లా రోలర్ స్కేటింగ్ క్రీడాకారులను శాప్ డైరెక్టర్ రవీంద్రబాబు అభినందించారు. మంగళవారం నెల్లూరులోని చిల్డ్రన్స్‌పార్క్‌లో వున్న స్కేటింగ్‌రింక్‌లో ఆ చిన్నారులకు అభినందన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ, జిల్లా క్రీడాకారులు ఎంతో ప్రతిభతో రాణిస్తుండడం సంతోషంగా వుందని, రాష్ట్ర జాతీయస్థాయిల్లో 20 పతకాలు సాధించి క్రీడారంగంలో జిల్లా కీర్తిని ఇనుమడింపజేస్తున్నారని అన్నారు. డిఎస్‌డిఓ యతిరాజ్ మాట్లాడుతూ, స్టేడియంలో త్వరలోనే స్కేటింగ్ రింక్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఒలంపిక్ అసోసియేషన్ కోశాధికారి రామమూర్తి, కోచ్‌లు జితేంద్ర, విశ్వనాథ్, భరత్‌తోపాటు క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సబ్సిడీ రుణాలకు వెల్లువలా ధరఖాస్తులు

ప్రభుత్వం ఇస్తామన్న సబ్సిడీ రుణాలకు జిల్లావ్యాప్తంగా ధరఖాస్తులు చేసుకునేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. నగరంలోని బిసి కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం ఆ ధరఖాస్తులను పరిశీలించారు. లబ్దిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. బిసి కార్పొరేషన్ ఇ.డి సి.సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యుల సమక్షంలో ఇంటర్వ్యూలు జరిగాయి. ఈ సబ్సిడీరుణాలకు నెల్లూరు నగరంలో 322 మందికి రుణాలు ఇవ్వాలన్నది లక్ష్యం కాగా, 2177 మంది ఆన్‌లైన్‌లో ధరఖాస్తులు చేసుకొన్నట్లు తెలుస్తోంది.

జిల్లావ్యాప్తంగా 2472 మందికి రుణాలు మంజూరు చేయాలన్నది లక్ష్యం కాగా, 12,508 మంది ధరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. అదేవిధంగా, మునిసిపాల్టీల పరిధిలో కావలిలో 740 మంది ధరఖాస్తు చేసుకోగా, వెంకటగిరిలో 379 మంది, గూడూరులో 208, ఆత్మకూరులో 136, నాయుడుపేటలో 140, సూళ్ళూరుపేటలో 76 మంది ధరఖాస్తులు చేసుకున్నట్లు తెలుస్తోంది.

## కృష్ణపట్నం పోర్టు అభివృద్ధికి

# అనిల్ సేవలు అపూర్వం

**• కలెక్టర్ నుంచి అవార్డు బహుకరణ**




జిల్లాలో పారిశ్రామిక ప్రగతికి ఎంతో కీలకమైన కృష్ణపట్నం పోర్టు అభివృద్ధికి పోర్ట్ సిఇఓ అనిల్ ఎండ్లూరి ఎంతో కాలంగా విశేష సేవలు అందిస్తున్నారు. ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి బుధవారం ఆయనకు అవార్డును బహుకరించారు. ఎంతో సంయమనంతో, సహకారంతో ముఖ్యంగా అందరిని కలుపుకుపోయే మంచి మనస్తత్వంతో ఆయన పోర్టు ప్రగతికి నిరంతరం ఎనలేని కృషి చేస్తున్నారు. పోర్టు అభివృద్ధికి ఎంతో అంకితభావంతో అనిల్ ఎండ్లూరి చేస్తున్న సేవలను అభినందిస్తూ కలెక్టర్ ఆయనకు అవార్డు ప్రదానం చేయడంతో అక్కడున్న అధికారులు, సిబ్బంది, సహచరులందరూ సంతోషం వ్యక్తం చేశారు. 72వ సెంట్రల్ ఎక్సైజ్ డే, నెల్లూరు కమిషనరేట్ ప్రథమ వార్షికోత్సవాలను పురస్కరించుకుని బుధవారం నెల్లూరులోని పివిఆర్ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఎండ్లూరికి అవార్డు ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కృష్ణపట్నం పోర్టు త్వరితగతిన అభివృద్ధి చెందుతోందని, పోర్టు పరిసర ప్రాంతాల్లో వచ్చే నాలుగేళ్ళలో 60 భారీ పరిశ్రమలు రానున్నాయని వెల్లడించారు. దేశ ఆర్థికాభివృద్ధిలో భాగస్వామిగా వున్న సెంట్రల్ ఎక్సైజ్‌శాఖకు జిల్లా అధికార యంత్రాంగం సంపూర్ణంగా సహకరిస్తుందన్నారు. నెల్లూరుకు సెంట్రల్ ఎక్సైజ్ కమిషనరేట్ రావడం సంతోషకరమంటూ సంబంధిత అధికారులను, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. నెల్లూరు సెంట్రల్ ఎక్సైజ్ కమిషనర్ ఎస్.ఖాదర్ రెహమాన్ మాట్లాడుతూ, తమశాఖ ద్వారా ప్రభుత్వానికి ఆరున్నర లక్షల కోట్ల రూపాయల దాకా ఆదాయం వస్తోందన్నారు. అనంతరం, కృష్ణపట్నం పోర్టు సిఇఓ అనిల్ ఎండ్లూరి మాట్లాడుతూ, ఇంత సంతోషభరిత వాతావరణంలో సెంట్రల్ ఎక్సైజ్‌శాఖ వార్షికోత్సవం జరగడం ఎంతో ఆనందకరమన్నారు. వ్యాపారం, పరిశ్రమలు వుంటేనే సంబంధిత శాఖల ప్రగతి సాధ్యపడుతుందని, అందరం పరస్పరం సహకరించుకుంటే పురోగతికి మంచి మార్గం ఏర్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జువారి సిమెంట్స్ ఉపాధ్యక్షులు కెఎస్ రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం, వ్యాపారులు, ఆడిటర్లు, టాక్స్‌పేయర్లు, న్యాయవాదులతో సమావేశమైన కమిషనర్ వారితో కలసి జిఎస్‌టి యాక్ట్‌పై చర్చా కార్యక్రమం నిర్వహించారు. అతిథులను, అత్యధికంగా పన్నులు చెల్లించిన సంస్థల నిర్వాహకులను, రిటైర్ట్ ఉద్యోగులను, సిబ్బందిని ఈ సందర్భంగా సెంట్రల్ ఎక్సైజ్‌శాఖ అధికారులు ఘనంగా సత్కరించారు.



విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలిగా ఎన్నికైన విఆర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ శ్రీమతి రాధికను అభినందిస్తున్న శాప్ డైరెక్టర్ ఎం.రవీంద్రబాబు, విఆర్‌సి అధ్యాపక సిబ్బంది గరుడేశ్వరరెడ్డి, టి.వి.రవీంద్రరెడ్డి, ఎన్.ప్రభాకర్ తదితరులు

# భారత్‌లో మహిళలకు గట్టి భద్రత



భారత్‌లో మహిళలకు భద్రత ఉందని చాటిచెబుతూ బెంగుళూరుకు చెందిన ఈషా గుప్త(36) మోటార్ బైక్‌పై అయిదు రాష్ట్రాలను సందర్శించి సోమవారం కడపజిల్లా నుంచి నెల్లూరుకు చేరుకుంది. నెల్లూరు మినీ బైపాస్‌రోడ్డులోని అమ్మ ఫర్నిచర్ షోరూమ్‌కు చేరుకున్న ఈష విలేకర్లతో మాట్లాడుతూ మహిళలు స్వతంత్రంగా తిరిగే స్వేచ్ఛ భారత్‌లో ఉందన్నారు. ఈ అంశంపై అవగాహన కల్పించేందుకే 2014లో బెంగుళూరు నుంచి బైక్ ర్యాలీ ప్రారంభించి కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 8500కిలోమీటర్లు ప్రయాణించినట్లు పేర్కొంది. ఇంకా 30వేల కిలోమీటర్లు ప్రయాణించి గిన్నీస్ రికార్డు నమోదు చేయనున్నట్లు తెలిపింది. ఈ కార్యక్రమంలో అమ్మ ఫర్నిచర్‌మాల్ అధినేత గడ్డం సుధాకర్‌రెడ్డి, సుజన్‌రెడ్డి, సుమన్‌రెడ్డి, కేతంరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరులో ఏపి రచయితల సమావేశం

ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం నెల్లూరుజిల్లా సభ్యుల సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెల 28వ తేదీ ఉదయం 10గంటల నుండి నెల్లూరు, పోలీసు ఆఫీసు రోడ్డులోని హోటల్ అతిథిగ్రాండ్‌లో జరుగుతుందని సంఘం కార్యదర్శి చిన్ని నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య, గౌరవాధ్యక్షులు పి.హనుమారెడ్డి, ప్రధానకార్యదర్శి చలపాక ప్రకాశ్, ఉపాధ్యక్షులు పెళ్ళకూరు జయప్రద, కోశాధికారి కలిమిశ్రీ, ఇతర రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. త్వరలో విజయవాడలో జరుగనున్న రచయితల సంఘం ఆవిర్భావ సభ గురించి, రచయితల సమస్యల గురించి ఈ సమావేశంలో చర్చిస్తారని, జిల్లాలోని రచయితలందరూ ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


# వైద్యరంగంలో అంతర్జాతీయ ఖ్యాతి




- **లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో డాక్టర్ రజనీకాంత్ ప్రతిభ**
- **యూరోపియన్ ఫెలోషిప్ సాధించిన తొలి తెలుగువాడు మన నెల్లూరీయుడే**

వైద్యరంగంలో విశేషమైన ప్రతిభతో రాణిస్తూ, లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో అంతర్జాతీయ ఖ్యాతి సాధించిన తొలి తెలుగువాడు మన నెల్లూరీయుడు కావడం సింహపురి సీమకే గర్వకారణం.. నెల్లూరీయుడైన డాక్టర్ రజనీకాంత్ పచ్చా అంతర్జాతీయ వైద్యరంగంలోనూ నెల్లూరుసీమ కీర్తి పతాకాన్ని రెపరెపలాడిస్తున్నారు. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో సాటిలేని మేటిగా రాణిస్తూ, ప్రపంచస్థాయిలో గుర్తింపు పొంది, ఎంతో అరుదైన యూరోపియన్ ఫెలోషిప్‌ను సైతం సాధించిన డాక్టర్ రజనీకాంత్ ప్రతిభ అపారమైనది. లివర్ ప్లాంటేషన్‌లో ఇంటర్నేషనల్ ఫెలోషిప్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, లివర్ మరియు ప్యాన్‌క్రియాటిక్ సర్జరీలోనూ ఎంతో ప్రతిష్టాత్మకమైన ఫెలోషిప్‌ను కూడా సాధించారు. లండన్‌లోని కింగ్స్ కాలేజ్ హాస్పిటల్‌లో సీనియర్‌గా కూడా పనిచేసి తన అమూల్యమైన సేవలందించారు. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో ఫెలోషిప్ అవార్డును సాధించిన మొట్టమొదటి తెలుగువాడుగా డాక్టర్ రజనీకాంత్ తన ప్రతిభాపాటవాలను నిరూపించారు. డాక్టర్ రజనీకాంత్ పచ్చా గుంటూరు మెడికల్ కాలేజ్‌లో గ్రాడ్యుయేషన్ చేసి, ఆ తర్వాత పాండిచ్చేరిలో బేసికల్ సర్జికల్ ట్రైనింగ్ తీసుకుని జిప్‌మర్ పూర్తిచేశారు. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో అయిదేళ్ళపాటు ప్రపంచ ప్రఖ్యాతి చెందిన లండన్ కింగ్స్ కాలేజ్ ఆసుపత్రిలో శిక్షణ పొందారు. వైద్యరంగంలోనే అపూర్వమైన రీతిలో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లోనూ, హెపటో బిలరీ సర్జరీలోనూ రెండు విశిష్టమైన ఫెలోషిప్‌లను సాధించి అందరి ప్రశంసలూ అందుకున్నారు. గ్యాస్ట్రో ఎంటరాలజీకి సంబంధించి యుకెలోని పలు ప్రఖ్యాతి చెందిన ఆసుపత్రుల్లో శిక్షణ పొందారు. ల్యాప్రోస్కోపిక్ సర్జరీలో కూడా డిప్లొమా సాధించారు. వైద్యరంగంలో విశేషమైన అవార్డులను అందుకుని, వైద్యరంగానికి ఎనలేని సేవలందిస్తున్న డాక్టర్ రజనీకాంత్ ఎంతైనా అభినందనీయులే. ప్రస్తుతం డాక్టర్ రజనీకాంత్ చెన్నైలోని గ్లోబల్ ఆసుపత్రిలో తన సేవలందిస్తున్నారు.

కాగా, కాలేయం వైఫల్యానికి అవయవ మార్పిడి ఎంతో అవసరమని, అదే ఖచ్చితమైన చికిత్స అని ఆయన అంటూ, అవయవ దానం చేస్తే మరో ఆరుగురికి జీవనదానం చేసినట్లవుతుందని రజనీకాంత్ ఈ సందర్భంగా తెలిపారు. ముఖ్యంగా బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి మృతి చెందితే అతని అవయవాలను దానం చేసినందువల్ల మరికొందరికి ప్రాణదానం చేసినట్లవుతుందని అన్నారు. బ్రెయిన్ డెడ్ అయి మృతిచెందినా ఆ వ్యక్తి అవయవాలైన కళ్ళు, కాలేయం, గుండె, ఊపిరి తిత్తులు, మూత్రపిండాలు మరొకరికి ఎంతో ఉపయోగపడి వారి జీవితాల్లో వెలుగులు ప్రసరించడానికి దోహదం చేస్తాయని, అందువల్ల ప్రతిఒక్కరూ అవయవదానం పట్ల అవగాహన కలిగివుండాలని కోరారు. అవయవదానమంటే జీవనదానమే కనుక, అవయవ దానం విశిష్టతను అందరికీ తెలియజెప్పాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.







# నెల్లూరు కబుర్లు

## సీఎం రాకకు సన్నాహాలు

ఈ నెల 27న జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. 27వ తేదీన కేవలం సెంబ్‌కార్ప్ గాయత్రి పవర్ కార్పొరేషన్ థర్మల్ విద్యుత్ కేంద్రం, జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాలను ప్రారంభించే కార్యక్రమాలలోనే చంద్రబాబు పాల్గొననున్నారు. కృష్ణపట్నం పోర్టు కంపెనీ నిర్మించిన 'నవనీతం' స్కూల్, పోర్టులో బెర్త్‌ల ప్రారంభోత్సవం వున్నప్పటికి, ఆ కార్యక్రమాలు వాయిదా పడ్డాయి. సీఎం పర్యటనను ప్రశాంతంగా ముగించేందుకు అధికారులు, జయప్రదం చేసేందుకు పార్టీ నాయకులు కృషి చేస్తున్నారు.

## పెద్దాయనకు ప్రేమతో...



సి.వి.శేషారెడ్డి, పందిళ్లపల్లి అరుణమ్మ, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, తుంగా దయాకర్‌రెడ్డి, టి.బాలసుధాకర్, రూబిన్... ఎమ్మెల్యేగా, మంత్రిగా, ముఖ్యమంత్రిగా, పార్లమెంటు సభ్యుడిగా ఎన్నో పదవులు అనుభవించి తన రాజకీయ విద్యతో ఎంతోమంది శిష్యులను తయారుచేసిన దివంగత నేత మాజీముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి జయంతులు, వర్ధంతులు జరపడానికి కాంగ్రెస్‌పార్టీలో మిగిలివున్న నాయకులు వీళ్ళు. జిల్లాలో ఎందరో నాయకులున్నారు. వారిలో చాలామంది మీద నేదురుమల్లి ముద్ర కనిపిస్తుంది. ఆనం, ఆదాల, పోలంరెడ్డి, పనబాక... వీళ్లంతా నేదురుమల్లి శిష్యులే. కాని పార్టీలు వేరయ్యాయి. పరిస్థితులు మారిపోయాయి. నేదురుమల్లి జయంతికైనా, వర్ధంతికైనా పటానికి పూలదండ వేసి దండం పెట్టుకోవడానికి ఓ నలుగురు మిగిలారు. పెద్దాయన వల్ల పదవులు పొందిన వాళ్లంతా కూడా రెక్కలొచ్చిన పక్షుల్లా ఎగిరి పోయారు. రెక్కలు రాని పక్షుల్లాంటి నాయకులు మాత్రం ఈ నెల 20వ తేదీన నెల్లూరులోని ఇందిరాభవన్‌లో నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి 81వ జయంతిని జరిపారు. బ్రతికినంత కాలం నేదురుమల్లిని నీడలా కనిపెట్టుకుని వున్న టి.బాలసుధాకర్ ఈ కార్యక్రమం ఏర్పాటు చేశాడు. సి.వి.శేషారెడ్డి, పందిళ్లపల్లి అరుణమ్మ, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తదితరులు పెద్దాయన ఫోటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇక్కడే పేదలకు అన్నదానం, వస్త్రదానం నిర్వహించారు.

## ఆనం గూటికి మరో కార్పొరేటర్



నెల్లూరు నగరపాలక సంస్థలోని తెలుగుదేశం కార్పొరేటర్లు మేయర్ అజీజ్ వర్గంగా, అజీజ్ వ్యతిరేకంగా విడిపోయి ఉన్నారు. ప్రస్తుతం తెలుగుదేశంలో ఆ పార్టీ కార్పొరేటర్లతో వైసిపి, కాంగ్రెస్ కార్పొరేటర్లు కూడా ఉన్నారు. వీరిలో అజీజ్‌కు ప్రత్యర్థిగా మారింది ఆనం వర్గం. కొందరు కార్పొరేటర్లు మాత్రం తటస్థంగా ఉంటున్నారు. ఆనం వర్గంలో మొన్నటి దాకా ఆనం రంగమయూర్‌రెడ్డి, కిన్నెర ప్రసాద్‌లు మాత్రమే వుండగా, తాజాగా కార్పొరేటర్ బొల్లినేని శ్రీవిద్య ఆ శిబిరంతో చేరినట్లుగా తెలుస్తోంది. మేయర్ కాబట్టి అజీజ్‌తో వున్న అవసరాల కొద్ది కొంతమంది కార్పొరేటర్లు ఆయనతో ఉంటున్నారు. క్రమక్రమంగా అజీజ్ వెనుకవున్న వాళ్లందరిని ఆనం లాగేయడం ఖాయం.

## వేదవ్యాసలో తల్లిదండ్రులకు శిక్షణ



నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని వేదవ్యాస స్కూలులో సోమవారం తల్లిదండ్రులకు కర్లపూడి కృష్ణయ్య ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను శారీరాత్మకంగా, భావాత్మకంగా, సాంఘీకంగా ఆర్థిక, ఆధ్యాత్మిక తదితర అంశాలతో, పిల్లలు పుట్టినప్పటి నుండి యుక్తవయసు వచ్చే వరకు వారిని సరైన విధానంలో శిక్షణ ఇచ్చి సమాజంలో వదలాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ ఎ.పి.బాలాజి వందన సమర్పణ చేశారు.

## ఇది మాడరన్ షాపింగ్‌మాల్



ఈ నెల 21వ తేదీన నెల్లూరు సరస్వతీనగర్‌లోని మాడరన్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన మాడరన్ బిగ్ బజార్‌కు విశేష స్పందన లభించింది. ఒక రిలయన్స్ మాల్, ఒక మోర్, ఒక బిగ్ బజార్‌ను తలపించేలా మోడరన్ షాపింగ్ మాల్‌లో వ్యాపార లావాదేవీలు నడిచాయి. విద్యార్థులకు బయట మార్కెట్ గురించి అవగాహన కల్పించాలని, వస్తువుల కొనుగోలు, అమ్మకాల గురించి తెలియజెప్పాలనే లక్ష్యంతో మాడరన్ స్కూల్ కరస్పాండెంట్ వాకాటి విజయకుమార్‌రెడ్డి ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ షాపింగ్ మాల్‌లో విద్యార్థులు అమ్మకందారులైతే వారి తల్లిదండ్రులు, ఆహుతులు, ఆహ్వానితులు కొనుగోలుదారులుగా మారారు. తోటకూర, పాలకూర, వంకాయ, టెంకాయ, బెండకాయ, దొండకాయ, స్వీట్స్, ఫ్రూట్స్, షర్ట్స్, ఫ్యాంట్స్, పప్పు, ఉప్పు, నిత్యావసర, ఫ్యాన్సీ, రెడీమేడ్ ఐటమ్స్ అన్నీ కూడా ఈ షాపింగ్‌మాల్‌లో వుంచి చౌకధరలకే అమ్మారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సమాజసేవకులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలు వచ్చి పరిశీలించి, సెల్లర్స్‌గా మారిన చిన్నారులను ప్రశంసించారు.

### నెల్లూరులో
## సినీతారల సందడి

'కృష్ణాగాడి వీర ప్రేమగాథ' చిత్రం యూనిట్ ఈ నెల 18న నెల్లూరొచ్చింది. ఈ సినిమా ప్రదర్శిస్తున్న ఎస్2లో ఈ చిత్రంలోని నటులు సందడి చేశారు. హీరో నాని, హీరోయిన్ మెహరిన్, నటులు శ్రీనివాసన్, మోక్షప్రశాంత్, దర్శకుడు హనుమరాఘువ, నిర్మాత రామ్ అచంట, గోపీచంద్, అచంట శత్రు తదితరులు పాల్గొన్నారు. హీరో నాని తన డైలాగ్‌లతో ప్రేక్షకుల చేత కేరింతలు కొట్టించాడు.

### ఫిబ్రవరిలోనే
## ఏప్రిల్ ఎండలు

నిన్న మొన్న పోయినట్లుంది ఎండా కాలం. వర్షాలెప్పుడొచ్చాయో, చలి ఎప్పుడు పోయిందో కూడా తెలియకుండానే మళ్ళీ ఎండాకాలం వచ్చింది. ఫిబ్రవరి నెలలోనే ఏప్రిల్ నెలలో కాసే ఎండలు కాస్తున్నాయి. అప్పుడే ఇళ్లల్లో ఏసిలు ఆన్ అవుతున్నాయి. కరెంట్ వాడకం ఈసారి బాగానే పెరగబోతోంది. ఫిబ్రవరిలోనే ఎండలు ఇలా వుంటే ఇక ఏప్రిల్, మే, జూన్‌ల పరిస్థితి ఎలా ఉండబోతోందోనని జనం బెంబేలెత్తుతున్నారు.

## ఇస్కాన్‌లో విశేష పూజలు



నెల్లూరు కొండాయపాళెంలోని ఇస్కాన్ మందిరంలో 20వ తేదీ రాత్రి నిత్యానంద త్రయోదశిని పురస్కరించుకుని విశేషపూజలు నిర్వహించారు. ఇస్కాన్ మందిర అధ్యక్షుడు సుఖదేవస్వామి మాట్లాడుతూ శతాబ్దాల క్రితం ధర్మ సంరక్షణార్ధం కలియుగంలో బలరాముడు నిత్యానందుడిగా అవతరించారన్నారు. ఈ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మందిరంలో శ్రీకృష్ణబలరామ సుభద్రలను విశేషంగా అలంకరించారు. స్వామివారికి అభిషేకాలు, మహాహారతి, 56 వంటకాలతో నివేదన జరిగాయి.

## యోగాలో మెరిసిన 'రత్నం' విద్యార్థి



జాతీయస్థాయి యోగా పోటీల్లో నెల్లూరులోని రత్నం విద్యాసంస్థల విద్యార్థి తన ప్రతిభ చాటుకుని, సింహపురిసీమ ప్రఖ్యాతిని ఇనుమడింపజేశాడు. రత్నం జూనియర్ కాలేజీలో ఇంటర్‌మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న కొండా రాధాకృష్ణారెడ్డి యోగాలో అత్యంత ప్రతిభ కనుపరచి ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా హరనాధపురంలోని రత్నం జూనియర్ కళాశాలలో ఈ నెల 21న రాధాకృష్ణారెడ్డికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రత్నం విద్యాసంస్థల అధినేత రత్నం మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ఒలంపిక్ అసోసియేషన్, స్పోర్ట్స్ అధారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ ప్రతిష్టాత్మక అంతరజిల్లాల యోగా పోటీల్లో తమ కళాశాల విద్యార్థి కొండా రాధాకృష్ణారెడ్డి ప్రథమ స్థానం సాధించడం తనకెంతో సంతోషంగా వుందంటూ, ఆ విద్యార్థిని ఆయన అభినందించారు. యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కర్నాటకలో జరిగిన జాతీయస్థాయి యోగా పోటీల్లో ప్రథమస్థానం సాధించి, బంగారు పతకంతో పాటు ప్రశంసాపత్రం అందుకోవడం ఎంతో ఆనందకరమన్నారు. భవిష్యత్తులో ఈ విద్యార్థి అంతర్జాతీయస్థాయి ఖ్యాతి సాధించాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## మైపాడు బీచ్‌లో 'ప్రేమలేఖ' హీరో



అజిత్, షాలినీలతో దువ్వూరు కల్యాణ్‌రెడ్డి కుటుంబసభ్యులు

తమిళ హీరో అజిత్, ఆయన భార్య షాలిని మరో 30మంది తమిళ నటీనటులు మూడురోజుల పాటు మైపాడులో గడిపారు. ఈ నెల 19వ తేదీన మైపాడుకు వచ్చిన ఈ బృందం స్థానిక నాయకులు దువ్వూరు కల్యాణ్‌రెడ్డి ఇంట్లో బస చేశారు. ఈ 3రోజుల పాటు వాళ్లు మైపాడు బీచ్‌లో, కల్యాణ్‌రెడ్డి తోటల్లో సరదాగా గడిపారు. గంగపట్నంలోని చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అజిత్, శాలిని వచ్చి అక్కడున్న సంగతి రెండురోజులపాటు మైపాడు వాసులకు కూడా తెలియలేదు. ఆదివారం వాళ్లు వచ్చిన విషయం బయటకు పొక్కడంతో స్థానికులు పెద్దఎత్తున వారిని చూడడానికి, వారితో ఫోటోలు దిగడానికి ఎగబడ్డారు. అజిత్, కల్యాణ్‌రెడ్డిలు చెన్నైలో చదువుకునే రోజుల్లో మంచి స్నేహితులు. ఆ స్నేహంతోనే అజిత్ అప్పుడప్పుడు మైపాడు వచ్చి పోతుంటాడని తెలిసింది. అజిత్‌కు ఇండస్ట్రీలో మంచి పేరుంది. అతనిలో అహంకారం ఇసుమంతైనా కనిపించదు. సాధారణంగా వుంటాడు. సినీహీరో అయ్యుండి తల జుట్టు తెల్లబడ్డా కనీసం రంగు కూడా వేసుకోడు. జుట్టు నెరిసినా అలానే ఉంచుకోవడం కూడా ఓ ఫ్యాషన్ అయిపోవడం అజిత్ నుండే వచ్చింది. ఈ సింప్లిసిటీ హీరో తనను చూడ్డానికి వచ్చిన అభిమానులతోనూ ఆత్మీయంగా వ్యవహరించడం విశేషం.

# శ్రావ్యంగా సాగిన హరికథా మహోత్సవాలు



ప్రఖ్యాత హరికథకుడు శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తిగారి స్ఫూర్తితో, హరికథలను నేటితరానికి అందజేయాలనే సదాశయంతో నెల్లూరు టౌన్‌హాలులో మూడు రోజుల పాటు జాతీయస్థాయిలో జరిగిన హరికథా మహోత్సవాలు ఎంతో శ్రావ్యంగా సాగి అందరినీ అలరించాయి. హరికథకు ఎంతో ఖ్యాతి తెచ్చిన ప్రసిద్ధ గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తండ్రిగారైన శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి హరికథాగానంలో అసమాన ప్రతిభతో ప్రజలను భక్తిభావ సమన్వితులను చేశారని, మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిబింబంగా వుండే ఇలాంటి కళా రూపాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందని ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న పలువురు వక్తలు ఆకాంక్షించారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు జరిగిన ఈ హరికథా మహోత్సవాలను తొలిరోజు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సతీమణి ఎస్పీ సావిత్రి, సోదరి ఎస్పీ శైలజ జ్యోతిని వెలగించి ప్రారంభోత్సవం గావించారు. ప్రముఖ సినీకవి వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని హరికథా గానమాధుర్యాన్ని రాష్ట్రవ్యాప్తం చేసిన ఘనత శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తికే దక్కుతుందని కొనియాడారు. బాలూ కుటుంబ సభ్యులు వసంత, గిరిజ, పార్వతి, శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి కమిటీ సభ్యులు, పలు సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు. అనేక ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రముఖ హరికథకులు ఈ మహోత్సవాల్లో పాల్గొని అత్యద్భుతంగా హరికథాగానం చేసి అందరి కరతాళ ధ్వనులందుకున్నారు. హైదరాబాద్ నుంచి విచ్చేసిన శ్రీరామభట్టర్ అన్నమయ్య హరికథాగానంతో టౌన్‌హాలు మార్మోగింది. ప్రముఖ హరి కథాకథన దక్షులు బాలకృష్ణమూర్తి, విశ్వనాథం, వసంత కుమారి, భవానిబాయి, రాజేశ్వరి, సరస్వతి, జయమతి సావిత్రి, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురికి కామధేను పురస్కారాలను అందజేశారు. పలువురు క్రీడాకారులను సత్కరించారు. సింహపురి వెల్ఫేర్ ఆర్గనైజేషన్, శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి కమిటీ, జిల్లా బ్రాహ్మణ-అర్చక సమాఖ్య తదితర సంస్థల ఆధ్వర్యంలో, నిర్మల నరసింహారెడ్డి, వీరిశెట్టి హజరత్ బాబు, నలబోలు బలరామయ్యనాయుడు, మైపాడు రాజా, సంఘమిత్ర రవీంద్రరెడ్డి తదితరుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు ఆద్యంతం ఎంతో హృద్యంగా సాగి అందరినీ ఆకట్టుకున్నాయి.

# బ్యారేజీ కల నెరవేరబోతుంది



- గట్టిగా చెబుతున్న నారాయణ

దాదాపు ఎనిమిదేళ్లుగా నత్తతో పోటీ పడుతూ పనులు సాగుతున్న నెల్లూరు బ్యారేజీని అక్టోబర్ నాటికల్లా పూర్తి చేస్తామంటున్నారు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ. ఈ నెల 20న పగటి పూట చీకటి పడక ముందే ఆయన నెల్లూరు బ్యారేజీ పనులను పరిశీలించారు. ఈ బ్యారేజీని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని ఆఘమేఘాల మీద పూర్తి చేస్తామన్నారు. ఈ బ్యారేజీ పూర్తయితే సాగునీళ్లకు, తాగు నీళ్లకు ఢోకా ఉండదన్నారు. అక్టోబర్ 31న ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ ప్రాజెక్ట్ ప్రారంభానికి ఆయన ముహూర్తం కూడా నిర్ణయించేసారు. ఔనులే... నాలుగు పైపులు పెట్టేసి పట్టిసీమ లాంటి ప్రాజెక్ట్‌ను పూర్తి చేసామని చెప్పి ఆర్భాటంగా ప్రారంభోత్సవం చేసిన వాళ్లకు ఈ బ్యారేజీ ఓ లెఖ్ఖ?

# వాణిజ్య బ్యాంకులకు ధీటైన సేవలు

**- డీసీసీబీ ఛైర్మెన్ మెట్టుకూరు**



వాణిజ్య బ్యాంకులకు ధీటుగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఖాతాదారులకు సేవలందించనున్నట్లు ఆ బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. 23వ తేదీ బ్యాంకు పాలకవర్గ సమావేశం జరిగింది. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ ఖాతాదారులకు, రైతులకు రూపే డెబిట్‌కార్డులను అందజేయనున్నామని, ఏటిఎంల ద్వారా నగదును డ్రా చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. నెల్లూరులోని స్టోన్‌హౌస్‌పేట, కావలి శాఖలలో ఎక్స్‌టెన్షన్ కౌంటర్‌లను ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటల దాకా పని చేసేలా సమయాన్ని మార్చడం జరిగిందన్నారు. తమ బ్యాంకులో రెండు సంవత్సరాల డిపాజిట్లపై 8.50శాతం, రెండేళ్లు పైబడిన డిపాజిట్లపై 9.25శాతం వడ్డీని ఇస్తున్నామన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు 0.75శాతం వడ్డీని అదనంగా ఇస్తున్నామన్నారు. బంగారం ఋణాల పరిమితిని 2లక్షల నుండి 10లక్షలకు, వ్యక్తిగత ఋణ పరిమితిని లక్ష నుండి రెండు లక్షలకు పెంచాలని పాలకవర్గంలో ఆమోదించినట్లు తెలిపారు. 2016-17 సంవత్సరానికి సంబంధించి వార్షిక అంచనా బడ్జెట్‌ను 56.83కోట్లకు ఆమోదించినట్లు పేర్కొన్నారు. మార్చి 11వ తేదీన బ్యాంకు మహాజన సభను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో బ్యాంకు సిఇఓ రమణారెడ్డి, ఆప్కాబ్ డిజిఎం భాస్కర్‌రెడ్డి, డిసిఓ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





మాతృదేవోభవ



మా మాతృమూర్తి దైవసన్నిధికి చేరి
21 ఏళ్ళు నిండనున్న సందర్భంగా
ఆమె ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...
ఆమె ఆత్మీయులైన వారందరికీ
మా మాతృదేవత ఆశీస్సులు కోరుకుంటూ...

డా॥ టి.సుబ్బరామిరెడ్డి
రాజ్యసభ సభ్యులు
మరియు
వారి కుటుంబసభ్యులు

# కళ్యాణ వైభవం...!



నెల్లూరుజిల్లా వాస్తవ్యులు, చెన్నై నివాసి సిద్ధారెడ్డి రంగారెడ్డి సోదరుడు స్వర్గీయ సునీల్‌కుమార్‌రెడ్డి - శ్రీమతి సహనల కుమార్తె **శ్రేయ - మధువినీత్** (గొర్రెపాటి సోమశేఖర్‌రెడ్డి - శ్రీలతల కుమారుడు)ల వివాహం ఫిబ్రవరి 17వ తేదీ నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది. వీరి రిసెప్షన్ వేడుక 19వ తేదీ విజయవాడలోని ది తాజ్ గేట్‌వే హోటల్ నందు వైభవంగా జరిగింది.
నూతన దంపతులకు 'లాయర్' అభినందనలు.



నెల్లూరు వాస్తవ్యులు బిట్రగుంట మనోహర్‌రెడ్డి - మనోరమల కుమారుడు **సూరజ్‌రెడ్డి - లక్ష్మీపద్మావతి** (నార్తురాజుపాళెం వాస్తవ్యులు కలికి రాఘవరెడ్డి - జ్యోతిల కుమార్తె)ల కల్యాణం ఈ నెల 10వ తేదీ కోవూరులోని అనపల్లి కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభదీవెనలు.



నెల్లూరులో ప్రసిద్ధిచెందిన టౌన్‌హాలు శ్రీ జ్యోతి వినాయక మందిరం ప్రధానార్చకుడు తెనాలి చలపతిరావు - పద్మావతిల కుమారుడు **అనంత్‌కుమార్ - లక్ష్మీప్రసన్న** (నెల్లూరురూరల్ బుజబుజనెల్లూరు వాస్తవ్యులు మాదాల యలమందయ్య - పద్మల కుమార్తె)ల పెళ్ళి ఈ నెల 17వ తేదీ టౌన్‌హాల్‌లో జరిగింది. కొత్తజంటకు 'లాయర్' శుభాకాంక్షలు.



వైయస్సార్సీపీ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి, ఇందుకూరుపేట మండలం పార్టీ కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి - హరితమ్మల కుమారుడు **ఉత్తమ్‌రెడ్డి - సుదీప్తిరెడ్డి** (పిన్నంరెడ్డి వెంకురెడ్డి - గిరిజమ్మల కుమార్తె)ల పరిణయం ఈ నెల 25వతేదీ నెల్లూరులోని అనిల్ గార్డెన్స్ నందు జరిగింది.
నవ దంపతులకు 'లాయర్' శుభాభినందనలు.







కావలి కబుర్లు

## నిబంధనలు సరే...

# పార్కింగ్ ఎక్కడ?

- **అధికారుల తీరుతో ప్రజలకు అవస్థలు**



కావలి పట్టణంలో ప్రధాన రహదారి అయిన ట్రంకురోడ్డు రోజు రోజుకు ఆక్రమణదారులతో కుంచించుకు పోతున్న తరుణంలో పలుమార్లు ఈ రోడ్డు విస్తరణ పనులను మొదలు పెట్టి వివిధ కారణాల చేత అసంపూర్తిగా మధ్యలో ఆపివేస్తుండటంతో ఆక్రమణదారులకు అడ్డు లేకుండా పోయింది. ఇటీవల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎ.వెంకటేశ్వర్లు మరోమారు ట్రంకురోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఈ విస్తరణ పనులలో అధికార, ప్రతిపక్ష నాయకుల నుండి ఎన్ని సమస్యలు వచ్చినా తమదైన శైలిలో ఎవ్వరినీ నొప్పించకుండా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పని పూర్తి చేయటమే కాక సిమెంటురోడ్డుకు 5 అడుగుల దూరంలో వాహనాలు నిలిపే విధంగా మార్కింగ్ ఇచ్చారు. ఇంతవరకైతే కమిషనర్ ఆలోచన బాగానే ఉంది కానీ, అసలు వాహనాలకు పార్కింగ్ స్థలాన్ని ఇంతవరకు చూపనేలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్, పోలీసు శాఖ కలసి చేపట్టిన ఈ నిబంధనలపై ముందుగానే ప్రజలకు అవగాహన కల్పించి, వాహన పార్కింగ్ స్థలాన్ని చూపించి ఉంటే ఈ పనులు చిరస్థాయిగా నిలిచిపోయి ఉండేవి. ఈ నిబంధనల వల్ల ట్రంకురోడ్డు ప్రక్కన దుకాణదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దుకాణానికి కొనుగోలుదారుడు వాహనంపై వస్తే దాన్ని ఎక్కడ నిలపాలో అర్థం కావడం లేదు. వీరు ఇచ్చిన మార్కింగ్‌కు కొంచెం ఇవతల ఉన్నా పోలీసులు కేసులు రాయడమో, లేక వాహన ప్లగ్‌లను పీక్కుపోవడమో చేస్తుండటంతో ప్రజలు పోలీసులపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ట్రంకురోడ్డుపై నిబంధనలను అతిక్రమించి వాహనాన్ని నిలిపివుండగా ప్లగ్ తీయబోయిన పోలీసులపై ఒక యువకుడు తిరగబడి పార్కింగ్ స్థలాన్ని చూపించకుండా కేసులు ఎందుకు రాస్తారు, ప్లగ్‌లను ఎలా తీస్తారని నిలదీశాడు. అందుకు పోలీసుల వద్ద సమాధానం లేకపోయింది. ఎందుకంటే వీరు పార్కింగ్ స్థలం చూపలేదు కాబట్టి. ఇలాంటి సందర్భాలు ప్రతిరోజూ ట్రంకురోడ్డుపై పోలీసులకు ఎదురౌతున్నా అటు మున్సిపల్ అధికారులు గాని, పోలీసు శాఖ గానీ పార్కింగ్ స్థలంపై దృష్టి పెట్టకపోవడం చర్చనీయాంశమైంది. ఒకవైపు రోడ్లు విస్తరణ పనులలో దుకాణాల ముందు తొలగించిన స్థలాన్ని ఆక్రమించి మళ్ళీ కొన్ని ప్రాంతాలు యదాస్థితికి వచ్చాయి. ట్రంకురోడ్డు ప్రక్కన కొందరు బడా రాజకీయ నాయకులు వ్యాపారాలు చేస్తూ ముందుకు వస్తుండటంతో వారిని చూసి మరికొందరు అదే బాటలో నడుస్తున్నారు. ట్రంకురోడ్డుపై తోపుడుబండ్ల సమస్య ప్రజలకు, దుకాణదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నా వీటిని నివారించకపోవడానికి గల కారణాలు ఏమిటని ప్రజలు నిలదీస్తున్నారు. వేలకువేలు అద్దెలు చెల్లిస్తున్న దుకాణాల ముందు ఏ అనుమతులూ లేని తోపుడుబండ్లు పెట్టి వారి వ్యాపారాన్ని దెబ్బతీస్తున్నారని దుకాణ యజమానులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తోపుడుబండ్ల వ్యాపారస్తుల వద్ద పోలీసులు మామూళ్ళకు అలవాటుపడి వాటిని తొలగించడం లేదని దుకాణ యజమానులు, ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఇకనైనా ఈ సమస్యలపై కమిషనర్ స్పందించి గతంలో మాదిరిగా రోడ్ల విస్తరణ పనులు మధ్యలో ఆగకుండా వీటికి శాశ్వత పరిష్కారం చూపాలని, అలాగే పట్టణాన్ని నిత్యం కంటికి రెప్పలా కాపాడే పోలీసుల పట్ల ప్రజలు ఆరోపణలకు తావివ్వకుండా చూడాలని పలువురు విద్యావేత్తలు కోరుతున్నారు.



## అద్వైత బ్లాసమ్ అపార్ట్‌మెంట్ ప్రారంభం

కావలి మాజీఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు కుమారుడు బీద మనోజ్ మేనేజింగ్ పార్టనర్‌గా చెన్నై ఓఎంఆర్ రోడ్డులోని కీలంబాకంలో నిర్మించిన అద్వైత బ్లాసమ్ అపార్ట్‌మెంట్‌ను ఇటీవల తమిళనాడు గవర్నర్ కె.రోశయ్య ప్రారంభించారు. మాజీ కేంద్రమంత్రి ఎ.కె. మూర్తి, చీరాల ఎమ్మెల్యే ఆమంచి కృష్ణ మోహన్, అద్వైత హోమ్స్ సిఇఓ రమేష్‌బాబు, గోవిందరాజు, బి.రాజారెడ్డి పాల్గొన్నారు.

# సురేంద్ర సేవలు ఆదర్శనీయం



సంయుక్త సేవా సంస్థ నిర్వాహకులు జి.సురేంద్ర సేవలు ప్రతి ఒక్కరికీ ఆదర్శం కావాలని కావలి రెడ్‌క్రాస్ సొసైటి సభ్యులు గంధం ప్రసన్నాంజనేయులు, సెక్రటరీ రవిప్రకాష్‌లు అన్నారు. ఇటీవల స్థానిక రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వికలాంగులకు, వృద్ధులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు తన్నీరు మాల్యాద్రి, డి.సుధీర్‌నాయుడు, అభయం సేవా సంస్థ సభ్యులు మురళి, ప్రభాకర్, సంయుక్త సభ్యులు డానియేలు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# జంపింగ్ జిలానీల పవర్‌షో

(మొదటి పేజీ తరువాయి)

మరికొందరు వైసిపి ఎమ్మెల్యేలు కూడా తెలుగుదేశంలోకి వెళ్లే అవకాశాలున్నాయి. ఈ ఆపరేషన్ ఆకర్ష్ అంతా కూడా నారా లోకేష్ కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు తెలుస్తోంది.

### అర్ధం పర్ధం లేని ఆపరేషన్..

వైసిపి ఎమ్మెల్యేలను పెద్దసంఖ్యలో చేర్చుకోవడం వల్ల చంద్రబాబుకు అదనంగా వచ్చే లాభమేమిటో ఆ పార్టీ వారికే బోధపడడం లేదు. చంద్రబాబు సర్కార్ బొటాబోటీ మెజార్టీతో లేదు. ప్రతిపక్షం కంటే 40సీట్ల దాకా ఎక్కువే వున్నాయి. రెండు, మూడు సీట్లు తేడా వుంటే ఎక్కడ ప్రభుత్వం కూలుతుందోనని భయపడి, పెద్దసంఖ్యలో ఎమ్మెల్యేలను కొనుక్కోవాలి. అసలిప్పుడు చంద్రబాబుకు ఎమ్మెల్యేలతోనే పని లేదు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలను తీసుకోవడం వల్ల ఆయన పార్టీలోనే లేనిపోని తలనొప్పులు. ఇప్పటికే ఆ పార్టీకి ఎమ్మెల్యేలు లేనిచోట ఇన్‌ఛార్జులున్నారు. వాళ్ళే ఎమ్మెల్యేలుగా చెలామణి అవుతున్నారు. ఇప్పుడు కొత్తగా వచ్చి చేరుతున్న ఎమ్మెల్యేలకు, ఇన్‌ఛార్జ్‌లకు మధ్య విభేదాలు రాకమానవు. ఇప్పటికే పలుచోట్ల తెలుగుదేశం నాయకుల మధ్యే గ్రూపు రాజకీయాలు ముదిరాయి.

### ప్రతిపక్షం నిర్వీర్యం సాధ్యమేనా?

రాష్ట్రంలో ప్రతిపక్షాన్ని లేకుండా చేస్తామని నారా లోకేష్‌బాబు ప్రగల్భాలు పలుకుతున్నాడు. దేశ రాజకీయ చరిత్రలో ప్రతిపక్షం అన్నది లేకుండా దేశంలో గాని, ఏ రాష్ట్రంలోనైనా గాని ఎన్నికలు జరిగాయా? ఒకసారి పరిశీలించుకోవాలి. ప్రతిపక్షాన్ని నిర్వీర్యం చేయడం ఎవరితరమూ కాదు. వైకాపా నిర్వీర్యమైతే దాని స్థానంలో ఇంకో పార్టీ వస్తుంది. చంద్రబాబు తన పార్టీని పటిష్టం చేసుకోవాలంటే, ప్రభుత్వాన్ని తిరిగి నిలబెట్టుకోవాలంటే ముందు తన పరిపాలనను మెరుగుపరచుకోవాలి. ఆయన పనితీరు బ్రహ్మాండంగా వుంటే, ఆయన పరిపాలన పట్ల ప్రజలు ఆనందభరితులైతే ప్రతిపక్షాన్ని ఆయన నిర్వీర్యం చేయడం కాదు, ప్రజలే ఆ పని చేస్తారు.

### రేపు జరగబోయేదేంటి?

చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులమై తెలుగుదేశంలో చేరామని జంపింగ్ జిలానీలు చెబుతున్నారు. ఇంతవరకు ప్రజలకు కనిపించని అభివృద్ధి, ఆఖరకు అధికారపార్టీ నాయకులకు కూడా కనిపించని అభివృద్ధి వారికి మాత్రమే కనిపించడం పెద్ద విడ్డూరమే! అసలు విషయం అభివృద్ధి కాదు. అధికారపార్టీలో ఎమ్మెల్యేలు మైనింగ్‌లు, ఇసుక క్వారీలు, కాంట్రాక్ట్‌లు, పోస్ట్‌లు వంటి పనుల్లో నాలుగురాళ్లు సంపాదించు కుంటున్నారు. మళ్లీ ఎన్నికలకు వీళ్లు ఆర్థికంగా నిలబడగలరు? వైకాపా ఎమ్మెల్యేల పరిస్థితి అదికాదు. 2014లో అభ్యర్థులుగా కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టారు. కొందరైతే అప్పులు కూడా చేశారు. తీరాచూస్తే పార్టీ అధికారంలోకి రాలేదు. వీళ్లకు అధికారం కాకుండా అప్పులు మిగిలాయి. ఈ ఆర్థిక లోటు పాట్లు పూడ్చుకోవడానికే వైకాపా ఎమ్మెల్యేలు అధికారపార్టీ వైపు చూస్తున్నారు.

తమ అవసరం కోసం పార్టీలో చేరిన వాళ్లంతా తనతోనే ఉంటారనుకుంటే అది చంద్రబాబు అమాయకత్వమే అవుతుంది. ఎన్నికల నాటికి ట్రెండ్‌ను బట్టి నాయకులు అటు ఇటూ మారే అవకాశముంది. ప్రభుత్వం మీద ప్రజల్లో పూర్తి వ్యతిరేకత వస్తే దానిని తట్టుకుని నిలబడే శక్తి ఏ పార్టీకీ లేదు. తెలుగుదేశం కూడా దానికి మినహాయింపు కాదు. చంద్రబాబు పరిపాలన బ్రహ్మాండంగా వుందంటే, ప్రజల్లో సానుకూలత వుందంటే ఇప్పుడున్న ఎమ్మెల్యేలైనా, కొత్తగా చేరుతున్న నాయకుడైనా ఆయన వెంట నిలుస్తారు. ఎన్నికలప్పుడు ప్రజల్లో వ్యతిరేకత కనిపించి తెలుగుదేశం మునిగే పడవలా కనిపిస్తే మాత్రం కొత్తోళ్లు, పాతోళ్లు అందరూ ఇవతలకు 'క్యా'కదతారు. ఇదీ జరగబోయేది. ప్రజల్లో తన పరపతి పెంచుకునే ప్రయత్నం చేయకుండా చంద్రబాబు ఎమ్మెల్యేలను పెంచుకోవడం వల్ల ఎటువంటి ఉపయోగం లేదు.

# ఇసుక దోపిడీకి టెండర్

(మొదటి పేజీ తరువాయి)

అప్పులు తెచ్చి మరీ టెండర్లలో పాల్గొన్నారు. టెండర్లకు ముందురోజే నెల్లూరులోని ఓ మాజీమంత్రి ఇంట్లో బిడ్‌దారుల సమావేశం జరిగింది. కొందరిని కాంప్రమైజ్ చేశారు. రీచ్ రేటును బట్టి టెండర్లకు సిద్ధమైన వాళ్లకు 5 నుండి 35లక్షల దాకా మాట్లాడుకున్నారు. టెండర్లు ఉపసంహరించుకుని మా దారిన మేం పోతామన్న వాళ్లకు చెక్కులు కూడా ఇచ్చేశారు. ప్రధాన రీచ్‌లకు సంబంధించి ఇక్కడే రాజీలు కుదిరి, ఏ రీచ్‌కు ఏ రేటు వేయాలనేది నిర్ణయించుకున్నారు. సిండికేట్ కాకుండా ఎవరిపాటికి వాళ్ళు బిడ్లు వేసుంటే జిల్లాలోని పొట్టేపాలెం, పల్లిపాడు, ముదివర్తి, గొల్లకందుకూరు, సజ్జాపురం వంటి రీచ్‌లకు రేటు బాగానే కోట్ చేసుండేవాళ్లు. కాని సిండికేట్ కావడం మూలంగా 123రూపాయల నుండి 210రూపాయల లోపే కోట్ చేస్తూ ఈ రీచ్‌లకు టెండర్లు పడ్డాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అయితే ఎక్కువ ధరకు కోట్ చేసిన వారికి ఇసుక రీచ్‌లను అప్పగించాలి. కాంట్రాక్టర్లు సిండికేట్ కావడం ప్రైవేట్ వ్యవహారం. ఈ సిండికేట్ కావడం కొత్తగా జరిగింది కూడా కాదు. ప్రభుత్వం ఇప్పుడు టెండర్లు రద్దు చేసి కొత్తగా టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు సిండికేటై రేటును నియంత్రించడాన్ని ప్రభుత్వం కూడా ఆపలేదు.

ఇసుక రీచ్‌ల సిండికేట్ గురించి మీడియాలో రావడం, నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దీనిపై ఫైర్‌కావడం వంటి చర్యలతో ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టింది. ఇసుకరీచ్‌ల అనుమతిని తాత్కాలికంగా ఆపింది. కాంట్రాక్టర్ల సిండికేట్‌పై కలెక్టర్ విచారణ జరుపుతోంది. మరోపక్క నిబంధనల ప్రకారమే టెండర్ల తంతు జరిగిందని, అధిక రేటు దాఖలు చేసినవారికి రీచ్‌లను అప్పగించాలని అధికారపార్టీ నాయకులు తమ అధినేతకు మొరపెట్టుకుంటున్నారు. మరి అధినేత వీరి మొర ఆలకిస్తాడో, తన మానాన తాను ఇసుక టెండర్లను రద్దు చేసి కాంట్రాక్టర్ల నోళ్లల్లో ఇసుక కొడతాడో చూడాలి.




# నెల్లూరుకు ప్రముఖుల తాకిడి

నెల్లూరీయుడు, రాజ్యసభ్యులు డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి ఏ కార్యక్రమం చేసినా అది పదిమంది పదికాలాల పాటు చెప్పు కునే విధంగానే వుంటుంది. అది సాంస్కృతిక కార్యక్రమమైనా, రాజకీయ ప్రోగ్రామ్ అయినా, వ్యాపార సంరంభమైనా... రచ్చ రంబోలానే!

ఈ నెల 27న ముత్తుకూరు మండలం పైనంపురంలోని తన సారధ్యంలో నిర్మించిన 'సెంబ్‌కార్ప్ గాయత్రి పవర్ కాంప్లెక్స్' 2640మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవాన్ని కూడా అదే రీతిలో జరిపించ బోతున్నాడు. ఈ వేడుక కోసంగా రెండు ప్రత్యేక విమానాలు, మరికొన్ని హెలికాప్టర్లను వినియోగిస్తున్నారు.

ఇక ఈ ప్రారంభోత్సవానికి అతిరథ మహారథులు విచ్చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు సింగపూర్ పరిశ్రమల మంత్రి ఎస్.ఈశ్వరన్, మన కేంద్రమంత్రులు యం.వెంకయ్య నాయుడు, పియూష్ గోయెల్, ప్రకాశ్ జవదేకర్, సుజనా చౌదరి, సెంబ్‌కార్ప్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ అంగ్‌కాంగ్ హూ, సిఇఓ టంగ్ కిన్ ఫీలతో పాటు రాష్ట్రమంత్రులు, దేశంలోనే అగ్రగణ్యులైన పారిశ్రామిక వేత్తలు, వివిధరంగాల దిగ్గజాలు, ప్రజా ప్రతినిధులు పెద్దసంఖ్యలో వస్తున్నారు. ఆహూతుల కోసం భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

# మూలస్థానేశ్వరునికి 2 నుంచి బ్రహ్మోత్సవాలు

మహాశివరాత్రిని పురస్కరించుకుని నెల్లూరులోని ప్రసిద్ధ ఆలయమైన శ్రీ మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో మార్చి 2వ తేది నుంచి 14 వ తేది వరకు వైభవోపేతంగా బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు 2న అంకురార్పణ జరుగుతుందని, ఈ ఉత్సవాల్లో స్వామివారికి వైభవంగా వాహనసేవలు, ప్రత్యేక పూజలు, శోభాయమానంగా అలంకారాలు నిర్వహిస్తామని ఆలయ ఇఓ కె. జనార్ధన్‌రెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాలకు 3వ తేదీన ధ్వజారోహణం జరుగుతుందని, అదేరోజున స్వామివారికి సింహవాహనసేవ నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా, 4న పురుషామృగ వాహనసేవ, 5న శేషవాహనం, 6న వెండి రావణసేవ, 7న గిన్నెభిక్ష, లింగోద్భవం, వెండి నందిసేవ, 8న కల్యాణం, గజవాహనోత్సవం జరుగుతాయన్నారు. 9వ తేదిన అంగరంగవైభవంగా స్వామివారికి రథోత్సవం నిర్వహిస్తామని, 10వ తేదీన యాళి ఉత్సవం, 11న అలకలతోపు, 12న తీర్థవాది కార్యక్రమాల అనంతరం ధ్వజావరోహణం నిర్వహిస్తామన్నారు. 13న ధవనోత్సవం, 14న ఏకాంతసేవ నిర్వహిస్తామన్నారు. భక్తులందరూ ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కార్పొరేషన్లో

# పనుల పందేరం వద్దు

నెల్లూరు నగర అభివృద్ధికి మంజూరైన పనులను పందారం పెట్టే పద్ధతిని మాను కోవాలని కార్పొరేటర్ ఆనం రంగ మయూర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ పద్ధతిపై రూ. 10లక్షల పనిని అయిదు మందికి కేటాయించేలా చర్యలు చేపడుతున్నారని తెలిపారు. దానివల్ల పనుల్లో నాణ్యత ఉండదన్నారు. పనులను విడదీసి కేటాయించే అధికారం కార్పొరేషన్ అధికారులకు లేదన్నారు.

# శివరాత్రికి విస్తృత ఏర్పాట్లు



శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివ రాత్రి బ్రహోత్సవాలు మార్చి2వ తేది నుంచి ప్రారంభం కానున్నాయి. ఈమేరకు బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై ఆలయ పాలక మండలి చైర్మన్ పోతుగుంట గురవయ్య నాయుడు అధ్యక్షతన రాష్ట్ర అటవీశాఖ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, చిత్తూరు జిల్లా కలెక్టర్ సిద్ధార్థజైన్, జాయింట్ కలెక్టర్ భరత్‌గుప్తా, అన్ని శాఖాధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు.




ఏర్పాట్లలో భాగంగా శ్రీకాళహస్తి నాలుగు మాడా వీధుల్లో కళ్ళు మిరుమిట్లు గొలిపేలా విద్యుత్ దీపాలంకరణ చేస్తున్నారు. అలాగే భక్త కన్నప్ప గుడికి పోవు దారి పొడవునా రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. నారద పుష్కరిణిని కూడా విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రతిరోజు సాయంత్రం నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు ధూర్జటి కళాప్రాంగణం భక్తులను అబ్బురపరిచేలా తయారుచేస్తున్నారు. మహాశివరాత్రి పర్వదినం రోజు అతిథులకు, ముఖ్య అతిథులకు స్వామి, అమ్మవార్ల ఆలయంలో అంతరాలయంలో ప్రవేశం నిషేధిస్తూ లఘదర్శనం ఏర్పాటు చేస్తామన్నారు. మహాశివరాత్రి పర్వదినాల్లో విద్యుత్ దీపాలంకరణ చేస్తున్నారు. ధూర్జటి కళా ప్రాంగణంలో నటరాజస్వామి, భక్తకన్నప్ప కొండపై భక్తకన్నప్ప స్వామి, సన్నిధి వీధిలో శ్రీ స్వామిఅమ్మవార్ల మూలవిరాట్లు, స్వర్ణముఖి బ్రిడ్జి పంచాయితీరాజ్ అతిథి గృహం వద్ద వినాయకస్వామి, స్వర్ణముఖి నది ముందర స్వామిఅమ్మవార్లు, జయ రామరావుపార్కు వద్ద శ్రీ ఆంజనేయ స్వామి, దుర్గమ్మ కొండపై కనకదుర్గమ్మ, పెండ్లిమండపం వద్ద శ్రీ స్వామిఅమ్మ వార్లు, నారద పుష్కరిణి కోనేరు వద్ద శ్రీ అన్నపూర్ణాదేవి, స్వామివారు, కుమార స్వామి కొండపై సుబ్రహ్మణ్యం స్వామి, వి.ఎం.సి సర్కిల్ వద్ద సిద్ధి బుద్ధి వినాయక స్వాములు, ధర్మరాజ స్వామి ఆలయం వద్ద అమ్మవారు, నాయుడుపేట బైపాస్ ఆర్చి వద్ద శ్రీ స్వామిఅమ్మవార్లు, బిక్షాల గాలిగోపురం వద్ద శివలింగం, ఏనుగు, పాముల రూపాలతో సీరియల్ సెట్స్ డెకరేషన్ ఏర్పాటు చేస్తున్నారన్నారు.

బ్రహ్మోత్సవాలలో భాగంగా మార్చి 2వ తేది భక్త కన్నప్ప ధ్వజారోహణము, 3వ తేది శ్రీ స్వామివారి ధ్వజారోహణము, 4వ తేది రెండవ తిరునాళ్ళు, 5వ తేది మూడవ తిరునాళ్ళు, 6వ తేది నాలుగవ తిరునాళ్లు, 7వ తేది మహాశివరాత్రి, 8వ తేది రథోత్సవము, 9వ తేది గురువారం కళ్యాణోత్సవము, 10వతేది సభాపతి కళ్యాణం, ఆనందరాత్రి, 11వతేది కైలాస గిరి ప్రదక్షిణము, 12వ తేది తీర్థవారి (ధ్వజారోహణము), 13వ తేది పల్లకీసేవ, 14వ తేది ఏకాంతసేవ, 15వ తేది శాంతి అభిషేకము, నిత్యోత్సవారంభంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ కార్యనిర్వహణాధికారిణి డి.భ్రమరాంబ తెలిపారు. దేవుడు సంచరించే మార్గాల్లో మాంసాహారాన్ని, మద్యపానాన్ని, నిషేధించామన్నారు. రాష్ట్ర అటవీ శాఖ మంత్రి బొజ్జలగోపాలకృష్ణారెడ్డి సూచనల మేరకు పాలకమండలి చైర్మన్ పోతుగుంట గురవయ్యనాయుడు, సభ్యులు అత్తింజేరి బాలాజీ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలను మొదటి రోజు 2వ తేది సినీ నటుడు బాలకృష్ణ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తామన్నారు.




## గూడూరు డివిజన్ వార్తలు

## గూడూరు జంక్షన్‌లో
# మౌలిక వసతులు కల్పించండి

గూడూరు రైల్వే జంక్షన్‌లో సమస్యలు అధికంగా ఉన్నాయి. నిత్యం వేలాదిమంది ప్రయాణీకులు ఇక్కడ నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. దేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లు తమిళనాడు, కర్నాటక, కేరళ తదితర రాష్ట్రాలకు వెళ్లాలంటే ఇక్కడ నుంచే దారి మళ్లేది. ఎంతో ప్రాముఖ్యత ఉన్న రైల్వేస్టేషన్‌లో పలు సమస్యలు తిష్ట వేశాయి. గూడూరు రైల్వే జంక్షన్ మీదుగా నిత్యం స్పెషల్ సర్వీసులతో కలిపి 150 రైళ్లు రాకపోకలు సాగిస్తుండగా, షుమారు 30వేల మంది ప్రయాణీకులు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమల శ్రీ వెంకటేశ్వరుని దర్శించు కునేందుకు వేలాదిమంది యాత్రికులు, భక్తుల రాకపోకలకు గూడూరే కేంద్రంగా ఉంది. దక్షిణాది రాష్ట్రాలకు వెళ్లే ప్రయాణీ కులకు ప్రధాన రైల్వేజంక్షన్ కూడా ఇదే. దాదాపు పదిహేనేళ్ల కిందట ఈ స్టేషన్ ఆధునీకరణకు నోచుకుంది. మౌలిక వసతులు కల్పించకుండా కేవలం భవనం ఆధునీకరణ, పార్కింగ్ ఇతర ఏర్పాట్లుతో సరిపెట్టుకున్నారని ప్రయాణీకుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. గూడూరు రైల్వే జంక్షన్‌కు విజయవాడ వైపు నుంచి వచ్చే రైళ్లను సమీపంలోని చల్లకాలువ వంతెనపై అవుటర్‌లో నిలిపి వేస్తున్నారు. దీనికి కారణం స్టేషన్లో తగినన్ని ఫ్లాట్‌ఫారాలు లేకపోవడమే. అలాగే చెన్నై నుంచి వచ్చే రైళ్లను దివిపాళెం ప్రాంతంలో నిలిపేస్తు న్నారు. మరోవైపు తిరుపతి, బెంగుళూరు, కేరళ నుంచి వచ్చే రైళ్లను కూడా గూడూ రులో ఫ్లాట్‌ఫారాలు లేకపోవడంతో సమీపంలోని గాంధీనగర్ ప్రాంతం అవు టర్లో పగలు, రాత్రి తేడా లేకుండా నిలుపు తున్నారు. దీంతో దూరప్రాంతాలకు వెళు తున్న ప్రయాణీకులు రక్షణపరంగా తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఇలా రైళ్లను రాత్రి సమయాల్లో నిలిపి ఉంచ టంతో దోపిడీ దొంగలు చోరీలు, దాడు లకు పాల్పడుతున్న సంఘటనలు అనేక మున్నాయి. రైల్వే అధికారులు స్పందించి ఫ్లాట్‌ఫారాలు పెంచాలని, మౌలిక వసతులు కల్పించాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

# మండిపడ్డ కౌన్సిలర్లు


సమావేశంలో చర్చిస్తున్న మున్సిపల్ చైర్మెన్, కౌన్సిలర్లు

గూడూరు పురపాలక సంఘ కార్యా లయంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై కౌన్సిలర్లు మండిపడ్డారు. ఇక్కడి పురపాలక కార్యాలయ సమావేశ మంది రంలో సోమవారం ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన అధ్యక్షతన అత్యవసర సమా వేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఆలస్యంగా రావడాన్ని సభ్యులు తప్పుబట్టారు. కమిషనర్ మోదకొండ వీడియోకాన్ఫరెన్స్‌కు వెళ్లారని, అందువల్ల సమావేశానికి హాజరుకాలేకపోయారంటూ అధికారులు వివరించినా సభ్యులు ఒప్పుకో లేదు. చివరకు ఆయన రావడంతో ఆల స్యంగా సమావేశం ప్రారంభమైంది. పట్ట ణంలో ఎల్ఇడి వీధి దీపాలు ఏర్పాటుకు సంబంధించి ఏడాదికి రూ.30లక్షలు చెల్లించేలా ఓ ప్రైవేటు సంస్థతో అప్పటి కమిషనర్ ఒప్పందం కుదుర్చుకోవడంపై ప్రధానంగా చర్చించారు. కౌన్సిల్ ఆమోదం లేకుండా ఎలా నిర్ణయం తీసుకొంటారని వైకాపా కౌన్సిలర్ యల్లసిరి గోపాల్‌రెడ్డి ప్రశ్నించారు. దీనిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఓ ప్రైవేటు సంస్థ పట్టణంలో కేబుల్ ఏర్పాటు నిమిత్తం సిమెంటురోడ్లను ధ్వంసం చేశారని, అందుకు సంబంధించి ఆ సంస్థ పురపాలక సంఘానికి చెల్లించిన రూ.10లక్షల్లో రూ.3లక్షలను మాత్రమే ఖర్చు చేశారని, మిగిలిన మొత్తాన్ని అభివృద్ధి పనులకు వినియోగించాలని కోరారు. ఇంకా పలు సమస్యలపై సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యన్ బర్త్‌డే సంబరాలు



గూడూరులోని ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ శ్రీకంఠి రామమోహన్ రావు - రాజ్యలక్ష్మి మన వడు(ఎస్.వి.మంజుప్రీతి - కామేశ్వర్‌ల కుమారుడు) ఆర్యన్ జన్మదిన వేడుకలు గూడూరులోని సిఆర్ మార్ట్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. తన బర్త్‌డే వేడుకల కోసమే ఆర్యన్ అమెరికా నుండి ఇండియాకు వచ్చి తన ఆత్మీయుల మధ్య జన్మదినోత్సవాన్ని జరుపుకున్నాడు. గూడూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్తలు, డాక్టర్లు, రాజకీయ నాయకులు ఈ వేడుకకు విచ్చేసి ఆర్యన్‌ను ఆశీర్వదించారు.

# రాంకుమార్ రక్తదానం



మాజీముఖ్యమంత్రి స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి 81వ జయంతిని పురస్కరించుకుని నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ విద్యానగర్‌లోని నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్ నందు రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా నేదురుమల్లి చిత్రపటానికి ఫౌండేషన్ ఛైర్మెన్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాంకుమార్‌రెడ్డితో పాటు ఎన్‌బికెఆర్ ఆర్ట్స్ కళాశాల మేనేజర్ కె.రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ డా॥ వి.విజయకుమార్‌రెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు రక్తదాన కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేశారు. నెల్లూరు రెడ్‌క్రాస్ సిబ్బంది సహకరించారు.

## స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో
# విఎస్ఆర్‌లో ఉచిత వైద్యశిబిరం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొనకా దేవసేన

స్వచ్ఛంద సంస్థలు తమ సేవలను విస్తృతం చేయాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన తెలిపారు. రెండో పట్టణం లోని కోర్టు సమీపానున్న విఎస్ఆర్ పాఠశాలలో ఆదివారం స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యాన ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవునిలోని భాగాల్లోకెల్లా నేత్రాలు ప్రధానమైనవని, వాటిపై నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. ఎలాంటి రుగ్మతలు తలెత్తినా వెంటనే వైద్యుని సంప్రదించి తగు చికిత్స పొందాలన్నారు. హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ నేత్ర విజ్ఞాన సంస్థ నేతృత్వంలో వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్టుకు చెందిన నేత్ర వైద్య నిపుణులు కంటి సంబంధిత వ్యాధులకు వైద్య చికిత్సలు చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు బాలరాజు, బాలకృష్ణంరాజు, గోవిందరాజు, చంద్రమోహన్‌రాజు, వివేకరాజు తదితరులు పాల్గొన్నారు.

## డిఆర్‌డబ్ల్యూ కళాశాల విద్యార్థులకు
# అవగాహన సదస్సు


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పొనకా దేవసేన

మానవ అక్రమరవాణాకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ప్రారం భించినట్లు వసంత లక్ష్మి ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహకురాలు వసంత లక్ష్మి తెలిపారు. గూడూరు పట్టణంలోని డిఆర్‌డబ్ల్యూ కళాశాలలో ఆదివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. రోజురోజుకు పెరుగుతున్న మానవ అక్రమరవాణాను అరికట్టేం దుకు ప్రజలు చైతన్యవంతమై నడుంబిగించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు. గోడపత్రికలను విడుదల చేశారు. ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా అక్రమరవాణాను అడ్డుకొనేందుకు ప్రయత్నిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, పట్టణ సి.ఐ సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యామలమ్మ, డాక్టర్లు సి.ఆర్.రెడ్డి, సి.రోహిణి తదితరులు పాల్గొన్నారు.

# పోలియోని సమూలంగా నిర్మూలించాలి
## - ఎమ్మెల్యే పాశం సునీల్


చిన్నారికి పోలియో చుక్కల మందు వేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

పోలియో వ్యాధిని సమూలంగా నిర్మూలించి పోలియో రహిత సమాజమే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని గడియారపు స్తంభం కూడలి వద్ద ఆదివారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన చేపట్టిన పోలియో చుక్కల మందు పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు చొరవ చూపి ఐదేళ్లలోపు చిన్నారులందరికీ చుక్కల మందును వేయం చాలని సూచించారు.

క్లస్టర్ పరిధిలో 15,346మంది చిన్నారులకు చుక్కల మందు వేయాలని లక్ష్యం కాగా 14,705మందికి పంపిణీ చేశామని ఉపవైద్యాధికారి ఈదూరు సుధాకర్ తెలిపారు. మెప్మా పిడి సోమయ్య, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన తదితరులు చిన్నారులకు పోలియో చుక్కల మందును వేశారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలుండగలవు. స్థిరాస్తుల లావాదేవీలకు తొందర పడవద్దు. అయిన వాళ్ళతో తగాదాలు రాకుండా చూచుకొనాలి. ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. వ్యాపారవృద్ధికి చేపట్టిన ప్రణాళికలు మంచి ఫలితాలనిస్తాయి. వ్యవహారాలలో కొన్ని ముఖ్యనిర్ణయాలు తేల్చకుండా తీసికొనవలసి యున్నది. ఆదాయం పెరుగుతుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

అవసరాలకు ఋణం చేయడం గాని, దాచుకున్న నిల్వ నుండి గాని ఖర్చులు చేయవలసిరావచ్చును. ఆదాయం ఖర్చులు సరిపోతుంటాయి. వృత్తి వ్యాపారాలలో ఆటంకాలను అధిగమించగలరు. సమాజంలో పలుకుబడి గౌరవాలు బాగుంటాయి. నిర్ణయాలు ఏ విషయంలో తీసికొనవలసినప్పుడు అనుభవపరుల సహకారం తీసికొనండి.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఉద్యోగులకు అదనపు బాధ్యతలు, యూనియన్ వ్యవహారాలు ఉంటాయి. స్థిరాస్థుల కొనుగోలు ప్రయత్నాలు జరుగుతాయి. ఆర్థిక స్థితి బాగుంటుంది. ఖర్చులు పెరిగినా భారమనిపించవు. రావలసిన బాకీలు కొంత వరకు లభిస్తాయి. కోర్టు వ్యవహారాలలో కొంత ఊరట దొరుకుతుంది. అనుకున్న పనులను ఏదో ఒక రీతిలో సాధించుకొంటారు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

గృహ మార్పులు, గృహ వస్తువాహన రిపేర్లు ఉంటాయి. ఆర్థికపరమైన ఇబ్బందులెదుర్కొంటారు. వ్యాపార వర్గాలలో అవకాశాలు తగ్గి, అసంతృప్తి ఉంటుంది. వాణిజ్య ఒప్పందాలు, రిజిస్ట్రేషన్స్, కొత్త పెట్టుబడులకు ఆహ్వానాలు అందుతాయి. వృత్తి పరంగా వ్యాపకం పెరుగుతుంది. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. కోర్టు కేసులు వాయిదా పడతాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఉద్యోగ బాధ్యతలలో జాగ్రత్త పడండి. అధికారులకు స్థాన మార్పులుండవచ్చును. అనుకున్న పనులకు అవకాశాలుండి కూడా సరిగా జరగక ఇబ్బందిపడతారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. ప్రముఖులతో పరిచయాలు పెంచుకుంటారు. స్థిరాస్తుల వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. ఆరోగ్యం బాగుంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

బిడ్డల వల్ల ఖర్చులు, కుటుంబ ఖర్చులు పెరుగుతాయి. కుటుంబసభ్యులతో సరైన అవగాహన కుదరక కోపతాపాలు కలుగుతాయి. ఉద్యోగులకు దైనందిన విధి నిర్వహణలో గుర్తింపు గౌరవాలుంటాయి. తొందరపాటు నిర్ణయాలు, తొందరపడి మాట్లాడటం చేయవద్దు. వాహనాలు యంత్రాల పనులందు జాగ్రత్త అవసరం. స్థిరాస్తుల క్రయవిక్రయాలు వాయిదా పడవచ్చును.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 26.2.2016 నుండి
తేది. 3.3.2016 వరకు

ఈ వారం సింహంలో గురు రాహువులు, కన్య తుల వృశ్చిక ధను రాశులలో చంద్రుడు, వృశ్చికంలో శనికుజులు, మకరంలో శుక్రబుధులు, 1 తేది నుండి కుంభంలో బుధుడు, కుంభంలో రవికేతువులు సంచరిస్తారు.

### పంచాంగము:

#### ముహూర్తములు

- తేది 26 శుక్రవారం ఉదయం 7.15 నుండి గంట 9.0లోగా మీన లగ్నమున గృహారంభ వ్యాపార వివాహము. శుక్రవారము రాత్రి 3.26 నుండి గంట 5.34లోగా మకరలగ్నమున వివాహ గృహప్రవేశములు.
- తేది 27 శనివారము రాత్రి గంట 3.20 నుండి గంట 5.26లోగా మకర లగ్నమున వివాహము.

### మాఘమాస కృష్ణపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 26 | శుక్ర | చతుర్థి | పూర్తిగ |
| తేది. 27 | శని | పంచమి | పూర్తిగ |
| తేది. 28 | ఆది | పంచమి | ఉ॥ గం.8.10వ॥ |
| తేది. 29 | సోమ | షష్ఠి | ఉ॥ గం.10.10వ॥ |
| తేది. 1 | మంగళ | సప్తమి | ప॥ గం.11.47వ॥ |
| తేది. 2 | బుధ | అష్టమి | ప॥ గం.12.59వ॥ |
| తేది. 3 | గురు | నవమి | ప॥ గం.1.45వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

అనవసర బాధ్యతలను పైన వేసికొనవద్దు. శుభకార్య ప్రయత్నాలలో బంధుమిత్రులు సహాయపడతారు. ప్రభుత్వ కార్యాలయాలలో పనులు వాయిదా పడవచ్చును. వృత్తి వ్యాపారాలలో కొద్ది అభివృద్ధి ఉండి ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. కుటుంబ ఖర్చులు, పలుకుబడి చేసే ఖర్చులు, చందాల ఖర్చులు అదనంగా ఉంటాయి. అనుకున్న పనులు కొద్దిపాటి ఆటంకాలతో సాగుతాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

క్రొత్త కాంట్రాక్టులు, అగ్రిమెంట్ల విషయంలో సంప్రదింపులు సలహాలు తీసుకొనడం మంచిది. అసోసియేషన్ కార్యక్రమాలలోను, శుభకార్యాలలోను ప్రముఖంగా వ్యవహరిస్తారు. వ్యాపార పారిశ్రామిక రంగాలలో పెట్టుబడులకు అవకాశాలు దొరుకుతాయి. వృత్తి నిర్వహణలో విశ్రాంతి ఉండదు. వ్యాపార వర్గాలకు పోటీలున్నా ఆదాయం పెంచుకుంటారు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

శుభకార్యాలు నిర్ణయం కాగలవు. ఆప్తుల నుండి పలకరింపులు, దూరముల నుండి ఆహ్వానపత్రికలు అందుకుంటారు. వ్యాపారాలలో పోటీలను అధిగమించి మంచి అవకాశాలు పొందుతారు. ఆదాయం పెరుగుతుంది. వృత్తిపరంగా వ్యాపకం బాగుంటుంది. కళా సాంస్కృతిక క్రీడా శాస్త్ర సాంకేతిక రంగాల వారికి గుర్తింపు గౌరవాలు అవకాశాలు బాగుంటాయి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఉద్యోగులకు సమర్థత అధికారుల సహకారం బాగుంటుంది. స్థిరాస్తులను విలువైన వస్తువులను పొందడం జరుగుతుంది. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. చేపట్టిన ప్రతి పని సమస్యగా కనిపిస్తుంది. వృత్తి వ్యాపారాలలో ప్రాపకం బాగుండి ఆదాయం బాగుంటుంది. కాని బిడ్డల వల్ల ఖర్చులు, ప్రయాణ, శుభకార్య ఖర్చులు పెరుగుతాయి. కోర్టు కేసులందు సమస్యలుండవచ్చును.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

మీకు తగని పనులందు తలదూర్చకండి. అనుకున్న పనులను ఏదో ఒక విధంగా నెరవేర్చుకొనినను మానసికాందోళన ఉంటుంది. స్థిరాస్తుల వ్యవహారాలు, వస్తు పంపకాల వంటివి ఇబ్బందులను కలిగిస్తాయి. వ్యాపార వర్గాలకు అదనపు పెట్టుబడి అవకాశాలు, అభివృద్ధి ఆదాయం పెరగడం ఉంటుంది. రాజకీయ వర్గాల వారు ఇబ్బందుల్లో పడతారు. స్థిరాస్తులు, షేర్ల మీద ఆదాయం పెరుగుతుంది. కోర్టు కేసులు వాయిదా పడతాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

అనుకున్న పనులకు స్వల్ప ఆటంకాలుండి తొలగిపోవడం, టెన్షన్ పడటం జరుగుతుంది. వ్యాపార రంగాల వారికి పోటీలుండి, అవకాశాలు చేజారిపోవడం, ఆశించినంత ఆదాయం రాకపోవడం ఉంటుంది. అయినా ఆర్థికంగా ఇబ్బంది పడవలసిన పని లేదు. స్థిరాస్తులను విలువైన వస్తువులను కొంటారు. రావలసిన డబ్బు చేతికి అందుతుంది. నగదు చెల్లింపులు సంతకాలుంటాయి.

# వైకాపా ఎమ్మెల్యేలను 'దేశం'లోకి పంపిన జగన్

శ్రీను గల్పిక

నవ్యాంధ్ర రాజధాని విజయవాడలోని ముఖ్యమంత్రి, హైటెక్‌రత్న చంద్రబాబు కార్యాలయం. ఎదురుగా మంత్రులు పి.నారాయణ, దేవినేని ఉమ, పత్తిపాటి పుల్లారావు, పరిటాల సునీత, యనమల రామకృష్ణుడు, బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, సిఆర్‌డిఏ ఛైర్మెన్ శ్రీకాంత్ ఉన్నారు. చంద్రబాబు తన టేబుల్ మీద అమరావతి రాజధాని మ్యాప్ పెట్టుకుని దాన్ని అటు ఇటు తిప్పి పరిశీలిస్తున్నాడు. ఏంటి సార్, ఆ మ్యాప్‌ను అంత తీక్షణంగా చూస్తున్నారెందుకని పత్తిపాటి పుల్లారావు అడిగాడు. రాజధాని మ్యాప్‌ను ఇంతకంటే అందంగా గీసేవాళ్లు లేరా? అని చంద్రబాబు అడిగాడు. అందుకు నారాయణ... లేకేం సార్, మ్యాప్ ప్రకారం దానిని కట్టాలంటే కష్టంగాని, మ్యాప్‌ను ఎంత అందంగానైనా గీయించవచ్చన్నాడు. చంద్రబాబు అందుకు బదులిస్తూ... మన పని అరచేతిలో వైకుంఠం చూపడమే కదా... అందమైన రాజధానిని కట్టే మాట దేముడెరుగు... రాజధాని మ్యాప్‌నన్నా అందంగా చూపిద్దామన్నాడు. సిఆర్‌డిఏ ఛైర్మెన్ నాగులాపురం శ్రీకాంత్ మాట్లాడుతూ... సార్, మనం సింగపూర్ వెళ్లొచ్చాక అమరావతిని సింగపూర్‌లాగా కడతామని, చైనా వెళ్లొచ్చాక బీజింగ్‌లాగా కడతామని, జపాన్ చూసొచ్చాక టోక్యోలాగా తీర్చిదిద్దుతామని, మలేషియా పోయొచ్చాక కౌలాలంపూర్‌లాగా కడతామని చెప్పివున్నాం. ఇంతకీ మనం ఏ నగరం టైపులో అమరావతి రాజధానిని కట్టబోతున్నామో చెప్పండి సార్ అని అడిగాడు. చంద్రబాబు నవ్వి... మా చిన్నప్పుడు ముక్కోటి, శివరాత్రి పండుగల రోజు ఊర్లలో ఒకే టిక్కెట్ మీద నాలుగు సినిమాలు వేసేవాళ్లు. రాజధాని కూడా అంతే, ఒకే మ్యాప్‌లో ఈ సిటీలన్నింటిని చూపించబోతున్నాం. అమరావతి తూర్పు వైపున 'సింగపూర్ ద్వారం', పడమరన 'కౌలాలంపూర్ ద్వారం', ఉత్తరం వైపున 'టోక్యో ద్వారం', దక్షిణం వైపు 'బీజింగ్ ద్వారం' అని పెడదాం. ఎగ్జిబిషన్‌లలో హిమాలయాలు, ఛార్మినార్, తాజ్‌మహల్ వంటి సెట్టింగ్‌లేస్తుంటారు చూసారా... వాళ్ల చేతనే ఈ ద్వారాల వద్ద ఆయా నగరాల సెట్టింగ్స్ వేయిస్తాను, రాష్ట్రంలో ఎంతమంది జనం సింగపూర్, టోక్యోలను చూసుంటారు... మనం రాజధాని కట్టినా ఎంతమంది చూస్తారు. మనం దేనిని చూపిస్తే అదే టోక్యో, అదే బీజింగ్ అనుకుంటారు అని చెబుతుండగా అక్కడకు మంత్రి పల్లె రఘునాథరెడ్డి వచ్చాడు. సార్, మా జిల్లాలో పేదలకు పక్కా ఇళ్ళు కట్టించాలి, సాగునీటి కాలువలు తవ్వించాలి, ఆసుపత్రులు, స్కూళ్లు పాడైవున్నాయి, వాటికి మరమ్మత్తులు చేయించాలి, ఓ వందకోట్లు మంజూరు చేయండని కోరాడు. దానికి కోపంగా చంద్రబాబు... ఇక్కడ రాజధాని కట్టడానికి డబ్బుల్లేక అడుక్కుంటుంటే నీకు నీళ్లు, ఇళ్లకు డబ్బులు కావాలా... ఏదైనా రాజధాని పూర్తయ్యాకే అని కసిరాడు. అంతలో చంద్రబాబు సెల్‌ఫోన్ మోగింది. బాబు ఫోన్ ఎత్తాడు. హైదరాబాద్ నుండి రేవంత్‌రెడ్డి... సార్, మన పార్టీ ఎమ్మెల్యేలంతా టిఆర్‌ఎస్‌లోకి పోతున్నారు. నేను ఇంకో నలుగురం మాత్రమే మిగిలాం అని అన్నాడు. అందుకు చంద్రబాబు... మీరు కూడా టిఆర్‌ఎస్‌లోకి పోతే నేను అక్కడ పార్టీని క్లోజ్ చేస్తాను. మీ ఒకరిద్దరి కోసం నేను అక్కడ పార్టీ కార్యాలయాన్ని ఎక్కడ రన్ చేయగలనని అన్నాడు. రేవంత్‌రెడ్డి షాకై... అదేంటి సార్, నేను మిమ్మల్ని నమ్ముకుని ఆ కేసీఆర్‌ను బండబూతులు తిట్టాను, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఆ పార్టీలోకి పోగలనని ప్రశ్నించాడు. రాజకీయాలలో అవేం వుండవులే... నన్ను బండబూతులు తిట్టిన కాంగ్రెస్, వైయస్సార్ కాంగ్రెస్ నాయకులను నేను ఇక్కడ తెలుగుదేశంలోకి తీసుకుంటున్నానుగా... ఇబ్బందేం లేదు. టీఆర్‌ఎస్ కాకపోతే కాంగ్రెస్, లేదంటే బీజేపీ, ఎంఐఎం... నీ ఇష్టమొచ్చిన పార్టీలో చేరంటూ ఫోన్ పెట్టేశాడు. తర్వాత చంద్రబాబే... తెలంగాణలో మన పార్టీని వదిలి ఎంతమంది ఎమ్మెల్యేలు పోతున్నారో, ఆంధ్రాలో ఆ లెక్కకు సరిపడా ఎమ్మెల్యేలను వైయస్సార్ కాంగ్రెస్ నుండి తీసుకురండని అన్నాడు. అప్పుడు నారాయణ.. అందుకు మేమెప్పుడో ప్లాన్ చేసాం సార్, ఆపరేషన్ ఆకర్ష క్రింద ప్యాకేజీ కూడా ప్రకటించాం. పార్టీలోకి వచ్చే ప్రతి ఎమ్మెల్యేలకి నెక్స్ట్ సీటు గ్యారంటీ, ఇక వాళ్ల నియోజక వర్గాలలో కాంట్రాక్ట్‌లు, ఇసుక క్వారీలు, మైనింగ్‌లన్నీ కూడా వాళ్లకే! అధికారుల ట్రాన్స్‌ఫర్‌లు, పోస్టింగ్ కలెక్షన్‌లన్నీ వారికే! నలుగురు ఎమ్మెల్యేలను తీసుకొస్తే ఒక మంత్రి పదవి అని స్పెషల్ ఆఫర్ కూడా ప్రకటించాం. పార్టీలోకి వచ్చే ప్రతిఎమ్మెల్యేను కూడా బ్యాండ్‌మేళం బాణాసంచా మోతల మధ్య గుర్రం మీద ఊరేగిస్తూ పార్టీ కార్యాలయానికి తీసుకొచ్చి తెలుగుదేశంలో చేర్చుకుంటామని ప్రకటించాం అని చెప్పాడు. వెరీగుడ్ నారాయణ... నీ ఎంసెంట్ కోచింగ్ తెలివితేటలన్నీ ఇక్కడ బాగా వాడుతున్నావ్, కీపిటప్ అంటూ చంద్రబాబు, నారాయణ భుజం తట్టాడు.

★★★★★

అది లోటస్‌పాండ్‌లోని వైకాపా కార్యాలయం. వై.యస్.జగన్మోహన్‌రెడ్డి తన ఎమ్మెల్యేలందరితో సమావేశమై ఉన్నాడు. జగన్ వారినుద్దేశించి... నా మూలంగా మీరంతా ఒట్టిపోయిన ఆవుల్లా అయ్యారు. ఈ పార్టీ కోసం కోట్ల రూపాయలు ఖర్చుపెట్టారు. ఈరోజు మీలో చాలామంది వద్ద టీకి కూడా చిల్లరలేదు. మీరు శుభ్రంగా తెలుగుదేశంలోకి వెళ్లండి, అక్కడ ఎమ్మెల్యేలతో పాటు మీరు కూడా నాలుగు రాళ్లు సంపాదించుకోండి. డబ్బు లేకుంటే వచ్చే ఎన్నికల్లో నిలవడం కష్టం. ఈరోజు ఏ పార్టీ కూడా సీట్లను సీనియార్టీని బట్టి ఇవ్వడం లేదు. మీరు డబ్బులు సంపాదించుకుని ఎలక్షన్ల ముందురోజు వచ్చి పార్టీలో చేరినా నేను సీటిస్తాను. నన్ను నమ్మండి. మీలో కొందరన్నా తెలుగుదేశంలోకి వెళ్లండి. డబ్బులు సంపాదించండి. ఇప్పుడు తెలుగుదేశం ఎమ్మెల్యేలలో చాలామంది మనవాళ్లున్నారు. ఎన్నికల నాటికి వాతావరణం మనకు అనుకూలంగా ఉంటే వాళ్లంతా ఇటే వస్తారు. మీరూ వాళ్లతో పాటే వచ్చేయండి అని కోరాడు. భూమా నాగిరెడ్డి లేచి... జగన్, నిన్ను వదిలిపెట్టి పోవాలంటే మనసుకు కష్టంగా వుంది. నేను పోనంటే పోను అని మొండికేశాడు. నేను మీ అందరి మంచి కోసమే చెబుతున్నాను. ఇక్కడే వుంటే మీకు నాకు ఖర్చు తప్ప ఆదాయం లేదు. ఇక్కడ ఉన్నాన్నాళ్ళు మీరు నా ఎదురుగా కాకపోయినా, మనసుల్లో అయినా నన్ను తిట్టుకుంటుంటారు. 2014 ఎన్నికల్లో నేను చిన్న పొరపాట్లు చేయకుంటే అధికారంలో ఉండేవాళ్లం కదా అనే భావన మీ అందరిలో వుంది. కాబట్టే చెబుతున్నాను మీరు ఏ అధికారమైతే కోరుకున్నారో అదే అధికారపార్టీలోకి వెళ్ళిపోండి. కావాలంటే నన్ను నాలుగు మాటలని పోండి. ఆ చంద్రబాబుకు అనుమానం రాకుండా విడతల వారీగా తెలుగుదేశంలోకి వెళ్లండి, నా మీద ఏ మాత్రం ప్రేమ, గౌరవం ఉన్నా వెంటనే నన్ను విడిచి వెళ్లండంటూ జగన్ లేచి లోపలకు వెళ్లిపోయాడు. ఆ సమయంలో వైకాపా ఎమ్మెల్యేల కంటికి జగన్... 'మాతృదేవోభవ' సినిమాలో పిల్లల్ని దత్తత పంపించి ఒంటరిగా మిగిలిన మాధవిని తలపించాడు.

# పోలియో రహిత సమాజం కోసం...



పోలియో రహిత సమాజాన్ని నిర్మించుకోవడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి యం.జానకి అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం మినీబైపాస్‌రోడ్డులోని జివిఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 30లక్షలకు పైగా వున్న జనాభాలో 0–5ఏళ్ల వయస్సు గల పిల్లలు 3లక్షల30వేల మందిని గుర్తించి, ప్రస్తుతం రెండవ విడత పల్స్ పోలియో చుక్కలు వేస్తున్నామని, అందుకు వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, ఎన్జీవోలు తదితర సిబ్బంది అంకిత భావంతో పని చేస్తున్నారన్నారు. నిరక్షరాస్యత, సరైన అవగాహన లేకపోవడం వల్ల కొంతమంది తమ పిల్ల లకు పల్స్‌పోలియోకు దూరంగా వుంటున్నారని, అలాంటివారికి ప్రతిఒక్కరు అవగాహన కల్పించాల్సిన అవసరముందని కలెక్టర్ స్పష్టం చేశారు. ముందుగా ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో, పారిశ్రామికవాడల్లో, మత్స్యకారుల గ్రామాల్లో, మురికివాడల్లో ఎన్జీవోలు, ఆరోగ్య కార్యకర్తలు ప్రజలకు చైతన్యం కల్పించాల్సిన అవసరముందన్నారు. ఇప్పటివరకు పోలియో వ్యాధులు నమోదు కానప్పటికి వచ్చే అవకాశాలు కొట్టిపారేయలేమని ఆమె వివరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి వరసుందరం, పడారుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది డా॥ కె.కిరణ్ కుమార్, టి.రాగవేణి పాల్గొన్నారు.

## అజీజ్‌కు సెగ స్టార్ట్





నెల్లూరు నగరపాలక సంస్థలో 13వ ఆర్థిక సంఘం విడుదల చేసిన 13.75కోట్ల రూపాయల పనులకు సంబంధించిన టెండర్లు రద్దు కావడం తెలిసిందే! ఈ పనులను దక్కించుకునేందుకు అజీజ్ వర్గం కార్పొరేటర్లు ఎన్నెన్నో ప్లాన్‌లు వేశారు. మీటింగ్‌లు పెట్టారు. కమిషన్‌లు పంచుకున్నారు. నోటి దాకా వచ్చిన కూడుపోయినట్లు ఆనం, అనిల్ వర్గీయులు వేసిన పోటీ టెండర్ల మూలంగా అజీజ్ వర్గీయుల కమిషన్‌లు పోయాయి. టెండర్లు తెరిస్తే తమకు ఒక్క పని కూడా దక్కదని తెలుసుకున్న అజీజ్ చివరకు ఆ టెండర్లనే రద్దు చేయించాడు. 13.75కోట్ల పనులను చిన్నచిన్న ప్యాకేజీలుగా విభజించి నామినేషన్ క్రింద తమ అనుచరులకు పనులివ్వాలనుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నామినేషన్ మీద పనులు కేటాయిస్తే కోర్టుకు పోవడానికి మేయర్ వ్యతిరేక వర్గీయులు సిద్ధంగా వున్నామని హెచ్చరించారు. మార్చి నెలాఖరులోపు ఈ నిధులు ఖర్చు చూపించాలి. ఈ నిధులు ఖర్చు చేస్తేనే మరో 6.75కోట్లు 13వ ఆర్థిక సంఘం నిధులు మంజూరవుతాయి. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో టెండర్లకు పోతే మేయర్ వర్గీయులకు పనులు దక్కడం కష్టమే. ఈ నెల 29న ఈ 13.75కోట్ల పనులకు మరోసారి టెండర్లు పిలిచారు. ఇంతకుముందులాగా కమిషన్లు మాట్లాడుకుని టెండర్లు వేసే పరిస్థితి లేదు. ప్రతి పనికి పోటీ టెండర్లు పడడం ఖాయం. ఈ పద్ధతిలో కమిషన్ల కోసం ఆశపడ్డ కార్పొరేటర్ల ఆశలపై నీళ్ళు చల్లినట్లే!



# బాధితుల బాధలు వినండి

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం నెల్లూరుజిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద అగ్రిగోల్డ్ బాధితుల సామూహిక నిరాహారదీక్ష చేపట్టారు. బాధితులకు ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మద్దతు తెలిపి మాట్లాడుతూ అగ్రిగోల్డ్‌కు నగదును చెల్లించి ఎంతోమంది రోడ్డున పడ్డారని తెలిపారు. అగ్రిగోల్డ్ ఆస్తులు జప్తు చేసి బాధితులకు నగదు చెల్లించాలని హైకోర్టు ఆదేశించినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. 8వేల కోట్లకు పైగా నగదును అక్రమంగా సేకరించిన అగ్రిగోల్డ్ సంస్థ యాజమాన్యాన్ని ఇంతవరకు ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అగ్రిగోల్డ్ ఆస్తులను ప్రభుత్వంలోని కొందరు పెద్దలు బినామి పేర్లతో తీసుకున్నట్లు ఆరోపించారు. ఈ విషయంపై అసెంబ్లీలో చర్చిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శేషగిరిరావు, కార్పొరేటర్లు ఎండి ఖలీల్ అహ్మద్, గోగుల నాగరాజు, అగ్రిగోల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు తిరుపతిరావు, మస్తాన్, సుధీర్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక మాఫియాపై ఇక యుద్ధమే!

**- కోటంరెడ్డి**



జిల్లాలో ఇసుక మాఫియా తయారైందని, అధికార పార్టీ నేతలు ఇసుక రీచ్‌లను దోచుకునేందుకు వ్యాపారులను బెదిరించి సిండికేట్‌లు కట్టించడం శోచనీయమని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ధ్వజమెత్తారు. 23వ తేదీ ఆయన నెల్లూరులోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం పెట్టి మాట్లాడారు. తొలిసారిగా జిల్లాలో అధికారపార్టీ నాయకులు ఇసుకరీచ్‌లలో కలుగజేసుకున్నారు. టెండర్లు వేసిన కాంట్రాక్టర్లను బెదిరించి జిల్లాలో ఏనాడూ లేని ఫ్యాక్షన్ సంస్కృతికి తెర తీశారు. ఇసుకరీచ్‌ల వేలంపాటల ద్వారా ఆదాయాన్ని పెంచాలని ప్రభుత్వం భావించి టెండర్లను ఆహ్వానించింది. అయితే అధికారపార్టీ నాయకులు కాంట్రాక్టర్లను భయపెట్టి వారిని టెండర్లు వేయనీయకుండా అడ్డుపడి, తాము తక్కువ ధరకే కోట్ చేస్తూ ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్నారు. దీనిని అడ్డుకోవాల్సిన అధికారులు కూడా భయపడి నిస్సహాయులుగా మిగిలిపోతున్నారు. పొట్టేపాలెం, సజ్జాపురం, ములుమూడి రీచ్‌లలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఇసుక మాఫియా పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో వైసిపి నగర అధ్యక్షులు తాటి వెంకటేశ్వర్లు, బొబ్బల శ్రీనివాసయాదవ్, మందా పెద బాబు పాల్గొన్నారు.

## క్యాన్సర్ బాధితులకు

# జడ్పీ ఉద్యోగుల చేయూత



క్యాన్సర్ బాధితుల వైద్యం కోసం ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వారు ఈ నెల 23వ తేదీన జిల్లా పరిషత్ సిఇఓ బి.రామిరెడ్డి చేతులమీదుగా 17,500రూపాయల చెక్కును అందజేశారు. ఓజిలి ఎంపిడివో కార్యాలయంలో పర్యవేక్షకులుగా పనిచేస్తున్న ఎ.వి.యస్.గురుప్రసాద్ ఒక్కరే 15వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ తరపున లక్కాకుల పెంచలయ్య, టి.గోపినాథ్, ఆమోస్‌బాబు, శ్రీనివాసులురెడ్డి, భీమిరెడ్డి, వి.రజనీకాంత్‌రెడ్డిలు పాల్గొన్నారు.

# మైథిలి స్కూల్ పాతికేళ్ళ వేడుక



నెల్లూరు, చంద్రమౌళినగర్‌లోని మైథిలి స్కూల్ పాతికేళ్ల సంబరాలు ఇటీవల ఎంతో వైభవంగా జరిగాయి. 1991లో మాజీముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ అయిన దివంగత బెజవాడ గోపాలరెడ్డి చేతులమీదుగా ఈ స్కూల్‌ను ప్రారంభించుకున్నారు. ఇప్పటికి 25 సంవత్సరాలు గడిచాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సిల్వర్‌జూబ్లీ వేడుకలకు శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దేశ విదేశాలలో ఉన్నత స్థానాలలో స్థిరపడిన ఈ స్కూల్ మునుపటి విద్యార్థులే ఈ స్కూల్ యొక్క విశిష్టతకు, విద్య పట్ల యాజమాన్యం చూపించే అంకితభావానికి నిదర్శనమన్నారు. ఈ స్కూల్ పురోగతికి శ్రమిస్తూ ప్రతియేటా మంచి ఫలితాలు సాధిస్తున్న స్కూల్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. డి.ఇ.ఓ ఆంజనేయులు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల అభిరుచి మేరకు వారికి ఇష్టమైన రంగాలనే ఎంచుకునేలా చూడాలన్నారు. మున్సిపల్ మంత్రి ఓయస్‌డి పెంచలరెడ్డి విద్య యొక్క ఆవశ్యకతను తెలియజేస్తూ తను ఉపాధ్యాయ వృత్తి నుండే వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రిటైర్డ్ హెడ్‌మాస్టర్ రాధాకృష్ణమూర్తిని ఘనంగా సన్మానించారు. ఈ పాఠశాల ఆరంభం నుండి పని చేస్తున్న టీచర్ మరియు డ్రైవర్‌లను సన్మానించి, స్కూల్ అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కరస్పాండెంట్ శ్రీమతి మైథిలీ, ఫౌండర్ బి.మనోహర్ రెడ్డిలతో పాటు ఈ కార్యక్రమంలో యమ్.ఇ.ఓ జగదీష్, డి.సి.ఇ.బి సెక్రటరీ రమేష్‌బాబు, అపస్మా వైస్‌ప్రెసిడెంట్ ఎం.వి.సుబ్బారెడ్డి, నెపస్మా జిల్లా అధ్యక్షులు షౌరెడ్డి, స్కూల్ డైరెక్టర్లు రాధాకృష్ణమూర్తి, ఫణీంద్రుడు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# తెలుగు అమలు కాగితాలకే పరిమితం



భోదనా భాషగా తెలుగు పూర్తిగా తిరోగమనంలో పడగా, పాలనా భాషగా తెలుగు అమలు కాగితాలకే పరిమితమైందని అనేక మంది వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఈ నెల 21వ తేదీ నెల్లూరు పాత జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నెల్లూరుజిల్లా తెలుగు భాషోద్యమ సమితి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలువురు భాషాభిమానులు, అధికారులు పాల్గొని ప్రసంగించారు. నెల్లూరుజిల్లా అదనపు జాయింట్ కలెక్టర్ ఆర్ఎస్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి, కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, శ్రీశ్రీ లాంటి మహామహులు తెలుగుభాషకు చేసిన సేవలు నేడు నిరుపయోగమయ్యాయని, పరాయి భాషల వ్యామోహం ఆధిపత్య ధోరణుల వల్ల మాతృభాషలోని మకరంధాన్ని ఆస్వాదించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ శాఖ మంత్రి ఓఎస్‌డి సిహెచ్ పెంచలరెడ్డి మాట్లాడుతూ 1999 నవంబర్ 17న యునెస్కో చేసిన తీర్మానంతో ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ప్రజలు, ప్రభుత్వం కలసి కృషి చేసినప్పుడే మాతృభాష పరిరక్షింపబడుతుందని లేదంటే మృతభాషగా మిగిలిపోతుందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి డి.ఆంజనేయులు మాట్లాడుతూ తెలుగు భాష గొప్పదనాన్ని తల్లిదండ్రులు తమ పిల్లలకు భోదించి ప్రోత్సహించినప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. ఈ సమావేశానికి తెలుగుభాషోద్యమ సమితి అధ్యక్షులు జి.కామయ్య అధ్యక్షత వహించారు. కార్యదర్శి బి.శీనయ్య, గౌరవాధ్యక్షులు సిహెచ్ భాస్కరరెడ్డి, డా॥ యం.వి. రమణారెడ్డి, నెరసం ప్రధాన కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజధానికి చిన్నారుల చేయూత



మన ఇటుక - మన రాజధాని కార్యక్రమంలో భాగంగా నెల్లూరు మనుమసిద్ధినగర్‌లో వున్న తీర్థ చిల్డ్రన్స్ హోం హైస్కూలు విద్యార్థులు ఒక్కొక్కరు రూ.10లు చొప్పున సేకరించారు. ఈ కార్యక్రమంలో 500మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథులుగా నెపస్మా అధ్యక్షుడు మైథిలి మనోహర్‌రెడ్డి, నగర అధ్యక్షుడు శౌరిరెడ్డి పాల్గొన్నారు. తీర్థ స్కూలు కరస్పాండెంట్ యం.ద్వారకానాథ్, ప్రిన్సిపల్ యం.సాయి కుమారి, స్కూలు ఇన్‌ఛార్జి బి.శ్రీనివాసులు మాట్లాడుతూ మన రాజధాని అమరావతికి మనవంతుగా ఒక ఇటుకను ఏర్పరచడానికి అవకాశం వచ్చిందని, రాజధాని నిర్మాణంలో పాలుపంచుకున్నందుకు మన అదృష్టంగా భావించాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇటుకకు ఇచ్చిన రూ.4,100లు చెక్కును ముఖ్యఅతిథులకు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.


# పన్ను బకాయిల వసూళ్ళు


నెల్లూరు నగరంలో పేరుకుపోయిన పన్ను బకాయిల వసూళ్ళపై ఎట్టకేలకు పట్టుబట్టి రెవెన్యూ అధికారులు మంగళవారం రూ.19.24లక్షల పన్నులను వసూలు చేశారు. మాగుంట లేఅవుట్, బాలాజీనగర్, స్టోన్‌హౌస్‌పేట, రంగనాయకులపేట, మూలాపేట తదితర ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు సమద్, గిరిజ ఆధ్వర్యంలో పన్నుల వసూలు కార్యక్రమం జరిగింది. నెల్లూరు నగరంలోని పలు ప్రాంతాల్లో అధికారులు బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. నెలాఖరులోగా పన్నులు చెల్లించకపోతే బకాయిలు వున్న వారిపై కఠినచర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఆర్ఐలు కృపాకర్, కృష్ణారావు, చినబాబు, శేఖర్‌బాబులు పాల్గొన్నారు.

# మా డివిజన్ సమస్యలు చూడండి



నెల్లూరు నగరపాలక సంస్థ 17వ డివిజన్‌లో వున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆ డివిజన్ టిడిపి ఇన్‌ఛార్జ్ ఫాసం శ్రీనివాస్ మరియు జన్మభూమి కమిటి సభ్యులు మేయర్ అజీజ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ డివిజన్‌లోని శ్రామికనగర్‌లో దోమలు, పందులు, కుక్కలు ఎక్కువై ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. అపోలో ఆసుపత్రి బ్రిడ్జిని ఆనుకుని వున్న రోడ్డు అన్యాక్రాంతమైంది. వెంటనే ఆక్రమణలు తొలగించాలి. గుంతలమయమైన ఆకుతోట అప్రోచ్‌రోడ్డును బాగు చేయాలి. ఇక్కడ శిథిలావస్థకు చేరిన లైబ్రరీని తొలగించి కొత్తది కట్టాలి. ఆకుతోట పార్కు స్థలం ఆక్రమణకు గురైంది. దానిని తొలగించి ప్రహరీ కట్టాలి. వడ్డిపాలెం వద్ద నున్న అరుంధతీయవాడ శ్మశానవాటికకు ప్రహరీగోడ కట్టాలని, గుండ్లపాలెం రోడ్డును సరిగా వేయాలని వారు కోరారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com